ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

3

ఆదివారం 11 ఫిబ్రవరి 2024

నిధులు ఎలా..?

తిరునాళ్ళ ఏర్పాట్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. తిరునాళ్ళకు ప్రభుత్వం ప్రత్యేక పండుగ హోదా కల్పించింది. గత ఐదేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు మాత్రమే రూ.10 వేలు నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంటోంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఏటా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు విడుదల చేసేవారు. తిరునాళ్లకు దాదాపు రూ.1.50 కోట్ల ప్రభుత్వం బకాయి ఉంది. మళ్ళీ తిరునాళ్ళ వస్తున్నా ప్రభుత్వం నుంచి ఈ నిధుల్లో రూపాయి కూడా విడుదల కాలేదు. ఆర్ అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీలకు తిరునాళ్ళ సందర్భంగా జరిగే ఏర్పాట్లకు నిధులు విడుదల చేయాలి. ఆయా శాఖల అధికారులు ఏర్పాట్ల కోసం నిధులు సమకూర్చుకోవటంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా జరిగే సమీక్షా సమావేశాల్లో నిధుల సమస్యలను ప్రస్తావిస్తున్నా దీనికి శాశ్వత పరిష్కారం లభించటం లేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు తిరునాళ్ళ ఏర్పాట్ల పై దృష్టి సారించాలి.



తిరునాళ్ల ఏర్పాట్లు.. ఊసేదీ?

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో మహా శివరాత్రి పర్వదినాన జరిగే తిరునాళ్ళ దేశ ప్రసిద్ధి. వచ్చేనెల 8న తిరునాళ్ళ జరగనుంది. ఏకాదశి రోజున తిరునాళ్ళ మహోత్సవాలు ప్రారంభ మవుతాయి. ఇంకా సమయం 25 రోజులే ఉంది. అయినా అధికారులు తిరునాళ్ళ ఏర్పాట్ల ఊసే ఎత్తటం లేదు. నేటి వరకు ఏర్పాట్ల పై సమీక్షలు నిర్వహించ లేదు. ఈ తిరునాళ్ళకు ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా కల్పించినా ఏటా నిధులు విడుదల చేయటం లేదు. దీంతో దాతల విరాళాల పైనే వివిధ శాఖలు ఏర్పాట్ల కోసం ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

- కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్ల మాటెత్తని యంత్రాంగం
- 25 రోజుల్లో త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ళ మహోత్సవాలు
- రాష్ట్ర పండుగ హోదా కల్పించినా నిధులు విడుదల కాని వైనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్ప కొండ తిరునాళ్ళ గడువు సమీపిస్తోంది. అయినా సంబంధిత శాఖలు ఏఏ ఏర్పాట్లు చేయాలనే అంశంపై స్పష్టత రాలేదు. పోలీసు, దేవాదాయ, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, అగ్నిమాపక, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యం, అటవీ, రెవెన్యూ తదితర శాఖలు తిరు నాళ్ళ ఏర్పాట్లలో కీలక పాత్ర పోషించాల్సి ఉంది. తాగు నీరు, పారిశుధ్యం, యాత్రికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. కొండ దిగువున, కొండ ఎగువున కోటయ్య స్వామి సన్నిధిన విస్తృత ఏర్పాట్లు చేయాలి. లక్షలాది మంది భక్తులు సులువుగా స్వామివారిని దర్శించు కొనేందుకు క్యూలైన్‌లు ఏర్పాటు చేయాలి. కొండకు వేలాది వాహనాలు తరలి వస్తాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పెట్లూరివారిపాలెం, అవిశాయపాలెం రహదారుల్లో వాహనాల రాకపోకలు ఉంటాయి. ఈ రహదారులకు అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలి. ఏటా తిరునాళ్ళ సందర్భంగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపటంలో అధికారులు విఫల మవుతున్నారు.

పొంచి ఉన్న నీటిగండం..

తిరునాళ్ళకు తరలి వచ్చే యాత్రికుల కోసం తాగు నీటి వసతి కల్పించాలి. ఈ దిశగా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాల్సి ఉండగా ఇందుకు జరుగుతున్న ప్రయత్నాలు లేవు. ఈ ఏడాది నీటి గండం పొంచి ఉంది. ఏటా చిలకలూరిపేట మేజర్‌కు సాగర్ నీటిని సరఫరా చేస్తారు. ఈ ఏడాది ఆ పరిస్థితులు కానరావడంలేదు. జలాశయాల్లో నీటి నిల్వలు నిండుకోవడంతో కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే సాగర్ నుంచి నీటి విడుదల చేస్తున్నారు. డ్యాంల నిర్వహణ కేఆర్ఎంబీ చేతుల్లో ఉంది. సాగర్ నుంచి తిరునాళ్ల కోసం నీటిని విడుదల చేయాలంటే ఖచ్చితంగా రివర్ బోర్డు అనుమతి తీసుకోవాల్సిందే. తాగు నీటి అవసరాలకు నీటిని విడుదల చేసే షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించారు. ఏప్రిల్ నెలలో తాగు నీటి అవసరాల కోసం సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తారు. తిరునాళ్ళకు నీటి కోసం కేఆర్ఎంబీ అనుమతి ముందుగానే తీసుకోవాల్సి ఉంది. ఈ అంశం లో సంబంధిత అధికారులు లేఖలు పంపాలి. ముందస్తు అనుమతి తీసుకోకుంటే తిరునాళ్ల జరిగే మార్చి 8 కల్లా నీరు వచ్చే పరిస్థితి ఉండదు. యంత్రాంగం వెను వెంటనే అప్రమత్తం కావాల్సి ఉంది.



పనిచేయని మోటార్లు..

కొండ దిగువన చెరువుల్లో నీరు అడుగంటింది. దీంతో బోర్ల నీటిపైనే దేవస్థానం ఆధారపడాల్సి ఉంది. కొండ దిగువన తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రెండు బోర్లు నిర్మించి వీటికి మోటార్లు ఏర్పాటు చేశారు. కొండ దిగువన సంపు నిర్మించి బోర్లు నీటిని పంపి అక్కడ నుంచి కొండపైకి పంపింగ్ చేసేవారు. ఈ విధానాన్ని కూడా దేవస్థానం అటకెక్కించింది. ఈ బోర్లకు మోటార్లు కూడా పనిచేయడంలేదు. ఒక బోరును నిరుపయోగంగా వదిలేశారు. ఇటీవల ఓ దాత మోటారు విరాళంగా ఇవ్వడంతో దాంతో నీటిని కొండపైకి సరఫరా చేస్తున్నారు. రెండు బోర్లు, వాటికి రెండు మోటార్లు సిద్ధం చేయకుంటే తిరునాళ్ల రోజున నీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఒక వేళ చిలకలూరిపేట మేజర్‌కు నీరు విడుదల చేయకపోతే భక్తుల స్నానాలకు నీటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. నీటికోసం ముందస్తుగా ఇప్పటినుంచే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై తక్షణమే దృష్టి సారించాలి. లేకుంటే తిరునాళ్ల రోజున భక్తులు నీటి కష్టాలను ఎదుర్కోక తప్పదు. దేవస్థాన అధికారులు, ఆర్ డబ్ల్యుఎస్, జలవనరుల శాఖ అధికారుల మధ్య నీటి సరఫరాలో సమన్వయం అవసరం.

తిరునాళ్ల తర్వాత రండి!

- పాత ఈవోనే కొనసాగుతారు
- కోటప్పకొండ ఏసీకి అధికార పార్టీ నేత హుకుం
- జాయినింగ్ రిపోర్టు ఇచ్చినా విధులు చేపట్టనివ్వలేదు
- చేరకుండా తామే అడ్డుకున్నామంటూ వైసీపీ నేత ప్రచారం



ఆ సీట్లో కూర్చోవద్దు.. తిరునాళ్ల తర్వాత రండి.. అప్పటివరకు పాత ఈవోనే కొనసాగుతారంటూ అధికార పార్టీ నేత ఏసీకి హుకుం జారీ చేశారు. నందివెలుగు గ్రూప్ దేవాలయాల ఈవోగా పనిచేస్తున్న నల్లకాలువ శ్రీనివాస రెడ్డి ప్రమోషన్‌పై కోటప్పకొండ దేవస్థానం ఏసీగా నియమితులయ్యారు. ఆయన శుక్రవారం జాయినింగ్ రిపోర్టును దేవస్థాన కార్యాలయంలో అందజేశారు. అయితే అయన విధులు చేపట్టకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకున్నారు. శనివారం కూడా దేవస్థానానికి శ్రీనివాసరెడ్డి వచ్చారు. విధులు చేపట్టవద్దని సదరు నేతలు అడ్డుకోవడంతో అయన కంగుతిన్నారు. చేసేదేమి లేక తన సీట్లో కూర్చోకుండానే వెనుదిరిగారు. కోటప్పకొండలో చక్రం తిప్పుతున్న వైసీపీ నేత ఏసీగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరిస్తే తన అక్రమాలు సాగవని ఏసీని విధుల్లో చేరకుండా అడ్డుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇన్‌ఛార్జ్ ఈవోగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏసీగా ఎన్.శ్రీనివాసరెడ్డి జాయినింగ్ రిపోర్టు ఇచ్చినా నిబంధనలకు విరుద్ధంగా ఈవోను కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోటప్పకొండ తిరునాళ్ల మార్చి 8న జరగనుంది. తిరునాళ్ల పూర్తయ్యేవరకు ఏసీని విధుల్లో చేరకుండా అడ్డుకుంటే తన అక్రమాలకు అడ్డంకి ఉండదనే ఉద్దేశ్యంతోనే ఏసీని విధుల్లో చేరనివ్వడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం కోటప్పకొండలో కూడా అధికార పార్టీ నేతల మితిమీరిన జోక్యం పెరగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిరునాళ్ల వరకు ఏసీ శ్రీనివాసరెడ్డి విధుల్లో చేరనిచ్చేది లేదని సదరు నేతలు గొప్పగా ప్రచారం చేసుకుండటం గమనార్హం. తిరునాళ్ల కొనుగోళ్ల లో అక్రమాలకు ఇక అడ్డంకి లేకుండా పోతుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చెరువు స్థలాలు బేరసారాలు

- చెరువును ఆక్రమించుకుని విచ్చలవిడిగా గృహ నిర్మాణాలు
- ఎన్నికలు రావడంతో ఇప్పుడు ఆందోళన
- రేపేమవుతుందనే భయంలో విక్రయాలకు సిద్ధం
- పట్టించుకోని అధికారులు



చెరువు భూమిలో నిర్మించిన గృహాలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి10: పిడుగురాళ్ల చెరువులో ఇల్లు, స్థలాలు కారుచౌకగా అమ్ముతామంటూ కొందరు ప్రచారం మొదలు పెట్టారు. అధికారంలో ఉన్నపుడు ఆక్రమించుకుని ఇల్లు కట్టుకున్నాం.. రేపు అధికారం పోయాక స్థలాల పరిస్థితి ఏమవుతుందో అనే ఆందోళనలో విక్రయాలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పిడుగురాళ్ల ఆర్టీసీ బస్టాండ్ వెనుక ప్రాంతంలో వున్న చెరువులో టీడీపీ హయాంలో కొందరు గృహాలు నిర్మించుకున్నారు. ఇంకా నిర్మించుకునే ఆశావహులు ఎక్కువైపోతుండటంతో చెరువు రక్షించాలన్న భావనతో అప్పటి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెరువు చుట్టూ కందకాలు తవ్వించి అక్రమ నిర్మాణాలు జరుగకుండా చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మెల్లమెల్లగా చెరువు స్థలంలో పిడుగురాళ్లకు చెందినవారే కాకుండా సమీప గ్రామాల వారు కూడా ఇబ్బడిముబ్బడిగా గృహాలను నిర్మించుకున్నారు. సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో గృహనిర్మాణం చేపట్టాలంటే సంబంధిత మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు పొందాలి. కానీ చెరువులో అనధికారికంగా నిర్మిస్తున్నా సంబంధిత శాఖాధికారులైన మున్సిపల్, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వుండటంతో ఆక్రమణదారులు పేట్రేగిపోయారు. ఒక్కొక్కరు 5 నుండి 10 సెంట్లు చెరువు స్థలాన్ని ఆక్రమించుకోవడం కాకుండా మరికొందరు లక్షల రూపాయలు ఖర్చుచేసి గృహాలను నిర్మించుకున్నారు.

రేపు ఏమవుతుందో..?

చెరువు భూమిలో ఇప్పటికే నిర్మించుకున్న నిర్మాణాల గురించి నివేదిక పంపాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఆదేశాలిచ్చినా స్థానిక అధికారులు ఇక్కడేమీ లేవంటూ గోప్యంగా నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. వాస్తవానికి చెరువు స్థలంలో సుమారు 50 గృహాలకు పైగా నిర్మించుకోగా, మరికొందరు అక్రమ నిర్మాణాలు జరగకుండా మున్సిపల్ నిధులతో నిర్మించిన రక్షణ గోడలను సైతం కూల్చివేసి చెరువు స్థలంలో గ్రావెల్ తోలి గృహాల నిర్మాణాలు చేపడుతున్నవారు నేటికి వున్నారు. పట్టణంలోని పలువురు కౌన్సిలర్లు ఏకంగా చెరువు స్థలాన్నే సెంట్ల కొద్దీ ధరను నిర్ణయించి విక్రయించారు. గత రెండేళ్లగా అక్రమ నిర్మాణాలు, స్థలాల ఆక్రమణ ఇష్టారాజ్యంగా జరిగాయి. ఇప్పుడు ఎందుకొచ్చిన తంటా అందినకాడికి అమ్మేసి సొమ్ము చేసుకుందాం అనే ఆలోచనలో స్థలాలు, గృహాలను సైతం గుట్టుగా బేరసారాలు జరిపిస్తున్నారు.



చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన రక్షణ గోడను సైతం కూల్చిన వైనం

అంతేకాకుండా రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే ఒకరిద్దరి అండదండలతో చెరువు స్థలాన్ని రెవెన్యూ రికార్డుల్లో కుదించేసి రికార్డులు సరిచేసినట్లు సమాచారం. అంతేకాకుండా రిజిస్ట్రేషన్ జరిగే సర్వే నెంబర్లు చూపి మరికొందరు చెరువు భూమిని కూడా రిజిస్ట్రేషన్ జరుపుకోవడం జరిగింది. చెరువు భూమితో పాటు సమీపంలోని బైపాస్ రోడ్డుకు పక్కనే వున్న మరికొంత ప్రభుత్వ భూమిని సైతం కొందరు అధికార పార్టీ నేతల చేతుల్లోకి తీసుకొని మరొకరికి విక్రయించేలా చేయడం వెనుక రెవెన్యూ కార్యాలయ అధికారుల ప్రమేయం వున్నట్లు తెలుస్తోంది. అక్కడ నిర్మాణాలు చేసుకునే వాళ్లంతా మన పార్టీ వారే మీరెవరూ వారి జోలికి వెళ్లొద్దంటూ కొందరు నేతలు చెప్పడంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూడా అక్రమ కట్టడాల విషయమై ప్రశ్నించడం గాని, నిలుపుదల చేసే సాహసం గానీ చేయ లేదనే ఆరోపణలు వున్నాయి.



చెరువు స్థలాన్ని ఆక్రమించి మట్టితోలిన దృశ్యం

పాపాల గుట్టు!

- మతుకుమల్లిలో ఆగని కల్తీపాల అక్రమాలు
- పాలల్లో చక్కెర, సాల్టు, యూరియా, పామాయిల్ మిక్సింగ్
- ప్రజల ప్రాణాలతో అక్రమార్కుల చెలగాటం
- మతుకుమల్లిలో 17 మంది, శానంపూడిలో 5 మంది కల్తీ చేసినట్లు గుర్తించిన అధికారులు
- గతనెలలో జెమినీ డెయిరీలో 6 ట్యాంకర్ల కల్తీపాలు నేలపాలు

మతుకుమల్లి(శావల్యాపురం), ఫిబ్రవరి 10: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో కల్తీపాల అక్రమాలను అరికట్టడం అధికారులకు సవాలుగా మారింది. పాలకేంద్రాలకు పోసే పాలలో వెన్న శాతం పెంచేందుకు యూరియా, పామాయిల్, చక్కెర, సాల్టు కలుపుతూ ప్రజల ప్రాణాలతో కొందరు చలగాటమాడుతున్నారు. అమూల్ సంస్థ ద్వారా ప్రభుత్వం మతుకుమల్లిలో ఏర్పాటు చేసిన మహిళా డెయిరీ సహకార సంఘంలో 72మంది పాల ఉత్పత్తిదారులుండగా రోజుకు రెండు పూటలా కలపి 500 లీటర్ల వరకు పాలు పోస్తున్నారు. గత సోమవారం సెంటర్‌కు వచ్చిన 14 శాంపిళ్ళపై అధికారులకు అనుమానం రావడంతో ల్యాబ్ పరీక్షలకు పంపగా వాటిలో 10 శాంపిళ్ళలో కల్తీ చేసినట్లు తేలాయి. దాంతో సెంటర్ నుంచి పాలు సేకరిస్తున్న జెమినీ డెయిరీ నుంచి సూపర్‌వైజర్ గురుస్వామి శనివారం మతుకుమల్లికి వచ్చి సెంటర్‌లో పాలఉత్పత్తిదారుల క్యాన్లలో పాలను తనిఖీ చేశారు. పాలలో తెల్లపేపరు వేయడంతో 20 క్యాన్‌లలో 5సెకెన్ల లోపే పేపర్‌పై నల్లని మచ్చలు వచ్చాయి. అనుమానంతో ల్యాబ్ పరీక్షల కొరకు 20 పాల శాంపిళ్లను సేకరించారు. వాటిలో 7 శాంపిళ్ళలో చక్కెర, సాల్టు కలిపినట్లు తేలింది. రోజూ 72 శాంపిళ్ళు వస్తుండగా శనివారం 67 శాంపిళ్ళు మాత్రమే రావడంతో మిగిలినవారిపై అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. గతవారంలో శానంపూడి మహిళా డెయిరీ సహకార సంఘంలో కూడా ఐదుగురు కల్తీకి పాల్పడడంతో 11 క్యాన్ల పాలు విరిగిపోయాయని అమూల్ మెంటార్ పాలపర్తి గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాలల్లో కల్తీకి పాల్పడ్డవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మతుకుమల్లి సెంటర్‌లో కొందరు కల్తీలకు పాల్పడడంతో నిజాయితీగా పాలు పోసేవారు కూడా రూ.3వేలు జరిమానా చెల్లించాల్సి వచ్చిందన్నారు. మండలంలో 13గ్రామాల్లో అమూల్ సెంటర్లు ప్రారంభించగా కారుమంచి, బొందిలిపాలెం, వేల్పూరు, పోట్లూరులలో సెంటర్లు మూతబడ్డాయని, మిగిలిన 9సెంటర్ల నుంచి రోజుకు 3వేల లీటర్ల పాలు సేకరిస్తున్నామన్నారు. రూట్ సూపర్‌వైజర్ బాషా మాట్లాడుతూ అమూల్ సెంటర్లలో సేకరించిన పాలను పంపుతున్న నూజెండ్ల మండలంలోని జెమినీ డెయిరీలో గతనెలలో కల్తీపాలని తేలడంతో 6 ట్యాంకర్లు పాలను తిరస్కరించడం జరిగిందని, శావల్యాపురం మండలం నుంచే కల్తీపాలు ఎక్కువగా వస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. తనిఖీల్లో సర్పంచ్ యలగాల బసవయ్య, ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు, అసిస్టెంట్ మెంటార్ రమాదేవి, రూట్‌ఇన్‌చార్జి ఖాజా, సెంటర్ కార్యదర్శి రాజారపు రాజ్యలక్ష్మి, వీవోఏలు నాగమల్లేశ్వరి, సాయి పాల్గొన్నారు.




మతుకుమల్లిలో నకిలీ పాలుతో అమూల్ అధికారులు

ఇంటి నంబరు జీరో


- వినుకొండలో 370కి పైగా ఓట్లు

వినుకొండ, ఫిబ్రవరి 10: వినుకొండ నియోజకవర్గంలో డబుల్ ఎంట్రీలు, జీరో ఇంటి నంబర్‌తో అనేక ఓట్లు ఉన్నాయి. పట్టణంతో పాటు నూజెండ్ల, బొల్లాపల్లి, శావల్యాపురం, ఈపూరు, వినుకొండ మండలాల్లో 370 ఓట్లకు ఓట్లు ఉన్నట్లు వెలుగుచూశాయి. నూజెండ్ల మండలం పువ్వాడలో 269వ బూత్‌లో సీ.నె. 147 సురభి ఠాగూర్, 2537660 నంబరు, ముట్లూరి రత్నకుమారి సి.నెం.148, 5326 నంబరుతో ఓటు కలిగి ఉంది. బొల్లాపల్లి మండలం చక్రాయపాలెం ఐదో బూత్‌లో 18 సి.నెం.తో బాణావత్ విష్ణుమూర్తి నాయక్ 1648138 ఓటు నంబరు, వినుకొండలో బూత్ నెం.194లో 196 సీ.నెంలో కుందా సామ్యేల్, 25695564 నంబరుతో ఓటు కలిగి ఉన్నారు. ఇలా చెప్పకుంటూ పోతే 370కు పైగా జీరో ఇంటి నంబరుతో ఓట్లు కలిగి ఉన్నా తప్పులను సరి చేసే నాధుడు కరువయ్యాడు.



147 SZO2537660

148 SZO170532



18 SZO1648136

ఓటరు పేరు : బాణావతు విష్ణుమూర్తి నాయక్

తండ్రి పేరు: బాణావతు లక్ష్మణ నాయక్

ఇంటి సంఖ్య : 0-00

వయస్సు : 24 లింగము : పు

జీరో డోర్ నంబరుతో ఓటు

ఇస్తిమా ప్రారంభం

సభలకు భారీగా హాజరైన ముస్లింలు



సమావేశానికి హాజరైన ముస్లింలు

పెదకాకాని, ఫిబ్రవరి 10: గుంటూరు సమీపంలోని నంబూరు పరిధిలోని జాతీయ రహదారి వద్ద ఇస్తిమా సభలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుంచి ముస్లింలు, సంఘ పెద్దలు పెద్దసంఖ్యలో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. రెండు రోజులపాటు జరిగే ముస్లిం సభల్లో భాగంగా ఆ ప్రాంతంలో ప్రత్యేక టెంట్లు, గుడారాలు ఏర్పాటు చేశారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, సంఘ పెద్దలు సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో శాంతి స్థాపన కోసం ప్రతి ఒక్క ముస్లిం వారి వంతు కృషి చేయాలన్నారు. సాటివారిని ప్రేమించాలని, మానవత్వం కలిగి ఉండాలని సూచించారు.

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ
నీటి పారుదల

పంటలకు కృత్రిమంగా నీటి వసతిని కల్పించడాన్నే నీటి పారుదల అంటారు. 1950-1951లో నీటి పారుదల వసతులు 22.6 మిలియన్ హెక్టార్లకు కల్పించగా... ప్రస్తుతం 139.89 మిలియన్ హెక్టార్లకు నీటి సౌకర్యం ఉంది.

భారతదేశంలో నీటి పారుదల ప్రధానంగా మూడు మార్గాలపై ఆధారపడి ఉంది. అవి.. బావులు, కాలువలు, చెరువులు.

బావులు: భారతదేశంలో అత్యధికంగా(62 శాతం) నీటి పారుదల బావుల ద్వారానే కల్పిస్తున్నారు. విస్తీర్ణపరంగా ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, శాతం పరంగా గుజరాత్‌లో అధికంగా నీటి పారుదల వసతులున్నాయి. బావులు రెండు రకాలు... గొట్టపు బావులు, సాధారణ బావులు. ఉత్తరప్రదేశ్‌లో బావులు అత్యధికంగా ఉన్నాయి.

కాలువలు: భారతదేశంలో 24 శాతం నీటి పారుదల కాలువల ద్వారా సమకూరుతోంది. విస్తీర్ణపరంగా ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్; శాతంపరంగా పంజాబ్‌లో అధికంగా కాలువల ద్వారా నీటి పారుదల కల్పిస్తున్నారు.

చెరువులు: దేశంలో 3 శాతం నీటి పారుదలను చెరువుల ద్వారా కల్పిస్తున్నారు. విస్తీర్ణపరంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ; శాతం పరంగా తమిళనాడులో అధికంగా చెరువుల ద్వారా నీటి పారుదుల సౌకర్యం ఉంది. చెరువులు ప్రధానంగా దక్షిణ భారత దేశంలోనే ఉన్నాయి. అత్యధిక నీటి పారుదల సాంద్రత పంజాబ్‌లో ఉంది. అత్యల్ప నీటి పారుదల సాంద్రత మిజోరంలో కలదు. ఇక భారతదేశంలో ఇతర నీటిపారుదల వసతులు 11.07 శాతం ఉన్నాయి.



ఆనకట్ట రకాలు

1. భూభాగ నిర్మాణం ఆధారంగా

చెక్ డ్యామ్స్: చిన్న చిన్న నీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మించేవి

డ్రై డ్యామ్స్: వర్షాభావ ప్రాంతాల్లో నేలల సంరక్షణ కోసం ప్రవాహ దిశను మళ్లిస్తూ నిర్మించేవి.

సాడిల్ డ్యామ్స్: ప్రధాన ఆనకట్ట కారణంగా లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా నిర్మించే ఆనకట్టలు

డైక్ డ్యామ్స్: సాడిల్ ఆనకట్ట లక్షణాలతో ప్రధాన ఆనకట్టను పోలివుండే వాటిని డైక్ డ్యామ్స్ అంటారు.

కాఫర్ డ్యామ్స్: నీటిలో మునిగి ఉన్న ప్రాంతంలో నిర్మాణాలు చేయడానికి ఆ నీటిని తొలగించడం కోసం నిర్మించే డ్యామ్స్

ఓవర్ ఫ్లో డ్యామ్స్: నది నుంచి లేదా ఆనకట్ట నుంచి ప్రవహిస్తున్న నీటిని శాస్త్రీయంగా లెక్కించడానికి నిర్మించే ఆనకట్టలు

2. డిజైనింగ్, ఇంజనీరింగ్ ఆధారంగా

గ్రావిటీ డ్యామ్స్: భారీ కాంక్రీట్ డ్యామ్‌లను గ్రావిటీ డ్యామ్‌లు అంటారు. లోతైన పునాదులతో నిర్మిస్తారు.

ఆర్చ్ డ్యామ్స్: వి ఆకారంలో ఉండే నదీలోయలకు అడ్డంగా నిర్మిస్తారు.

ఉదా: ఇడుక్కి-కేరళ(ఎత్తు 169 మీ.)

ఎమ్ బ్యాంక్ మెంట్ డ్యామ్స్: రాళ్ల మధ్య ఖాళీలను మట్టి లేదా కాంక్రీట్‌తో పూడ్చుతారు. వీటిలో ఎర్త్ ఫిల్ డ్యామ్, రాక్ ఫిల్ డ్యామ్, రబ్బర్ డ్యామ్, ఆస్ఫేట్ డ్యామ్ ఉన్నాయి.

3. నీటి నిల్వ సామర్థ్యం ఆధారంగా/ఆయకట్టుకు నీటిని అందించే సామర్థ్యం ఆధారంగా

భారత ప్రణాళికా సంఘం మన దేశంలోని నీటి పారుదల ప్రాజెక్టులను ఆయకట్టు ప్రాంతం ఆధారంగా మూడు విధాలుగా వర్గీకరించింది.

భారీ తరహా ప్రాజెక్ట్: 10,000 హెక్టార్ల కన్నా ఎక్కువ సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

మధ్య తరహా ప్రాజెక్ట్: 2,000- 10,000 హెక్టార్ల మధ్య సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

చిన్న తరహా ప్రాజెక్ట్: 2,000 హెక్టార్ల కంటే తక్కువ సాగు భూమికి నీటి పారుదల వసతిని కల్పించే ప్రాజెక్టు.

ప్రధాన ప్రాజెక్టులు

దామోదర్ వ్యాలీ

- దామోదర్, దాని ఉప నదులపై నిర్మించిన నాలుగు ప్రాజెక్టులను కలిపి దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు అని పిలుస్తారు.
- 1948లో దేశంలో మొట్టమొదటి వరద నియంత్రణ కార్యక్రమంగా దామోదర్ వ్యాలీ ప్రాజెక్టును ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్టు అమలు కోసం 'దామోదర్ వ్యాలీ కార్పొరేషన్'(డీవీసీ) అనే సంస్థను ఏర్పాటు చేశారు.
- డీవీసీకి సహాయపడిన సంస్థ టెన్నిస్ వ్యాలీ అథారిటీ
- డీవీసీలో భాగంగా ఊర్దిన్ ప్రతిపాదించిన డ్యామ్‌ల సంఖ్య: 7
- ఇప్పటి వరకు నాలుగు డ్యాములను నిర్మించారు. అవి.. కోనార్(కోనార్ నదిపై), పాంచెట్(దామోదర్ నదిపై), తిలయ(బారకార్ నదిపై), మైదాన్(బారకార్ నదిపై).
- ఊర్ధిన్ అమెరికాలోని టెన్నిస్ వ్యాలీ అథారిటీ ఛైర్మన్
- దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు అమెరికాలోని టెన్నిస్ వ్యాలీ నమూనాను పోలి ఉంటుంది.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

- **నిర్మాణం ప్రారంభం అయిన సంవత్సరం:** 1955 డిసెంబరు 10
- **నిర్మాణం పూర్తి:** 1967 ఆగస్టు 4. ఇందిరాగాంధీ ప్రారంభించారు.
- ఈ ప్రాజెక్టును కృష్ణా నదిపై నందికొండ గ్రామం(నల్లగొండ) వద్ద నిర్మించారు.
- **దీని నిర్మాణ ఇంజనీర్:** కానూరి లక్ష్మణ రావు
- డ్యామ్ నిర్మాణానికి కేంద్రం ఖోస్లా కమిటీని ఏర్పాటు చేసింది.
- ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు అని ఈ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా నెహ్రూ వ్యాఖ్యానించారు.
- నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి ఎత్తయిన రాతి ఆనకట్ట. **ఎత్తు:** 124.7 మీటర్లు, **పొడవు:** 1550 మీ. నీటి నిల్వ **సామర్థ్యం:** 408 టీఎంసీలు. స్థాపిత విద్యుత్ **సామర్థ్యం:** 826 మెగా వాట్లు.
- ఈ ప్రాజెక్టుకు రెండు కాలువలు ఉన్నాయి. ఒకటి జవహర్ లాల్ నెహ్రూ కాలువ(కుడి కాలువ)- దీని పొడవు 203 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సాగునీటి వసతులను కల్పిస్తుంది. రెండోది లాల్ బహదూర్ శాస్త్రి కాలువ(ఎడమ కాలువ)- దీని పొడవు 296 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, ఏలూరు, జిల్లాలకు; తెలంగాణలోని నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాకు సాగునీటి వసతులను కల్పిస్తుంది.

ఇందిరా గాంధీ కాలువ

- దీనిని రాజస్థాన్ కాలువ అని కూడా పిలుస్తారు. దీనిలో సట్లెజ్, రావి, బియాస్ మూడు నదుల నీరు ప్రవహిస్తుంది. దీని ప్రధాన కాలువ హరికే బ్యారేజ్ నుంచి ప్రారంభమవుతుంది. ఉప కాలువలు బియాస్, రావి నదుల నుంచి ప్రారంభమవుతాయి. దీని ప్రధాన కాలువ పొడవు: 650 కి.మీ. ఇది మూడు రాష్ట్రాలకు నీటి వసతులను కల్పిస్తుంది. పంజాబ్‌లో 167 కి.మీ., హర్యానాలో 38. కి.మీ., రాజస్థాన్‌లో 445 కి.మీ. ప్రవహిస్తుంది. రాజస్థాన్‌లోని థార్ ఎడారిలోని గంగానగర్, బికనీర్, జైసల్మేర్, జోధ్‌పూర్ వరకు నీటి వసతులను కల్పిస్తుంది. ఇది దేశంలోనే అతి పొడవైన వ్యవసాయ కాలువ.

నోట్: ప్రపంచంలో అత్యంత పొడవైన వ్యవసాయ కాలువ: ద గ్రాండ్ కెనాల్ - చైనా - 1776 కి.మీ. (బీజింగ్ నుంచి హాంగ్ జంగ్ నగరం వరకు కలదు).



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

బయోటెక్నాలజీలో ప్రవేశానికి జీఏటీ-బీ/బీఈటీ

బయోటెక్నాలజీ విభాగాల్లో పీజీ ప్రవేశాలకు ఉద్దేశించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ (జీఏటీ-బీ) 2024, అలాగే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం నిర్దేశించిన బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) 2024లకు నోటిఫికేషన్ వెలువడింది. వీటిని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షల సిలబస్, పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు, సీట్ల వివరాలకోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

జీఏటీ-బీ

ఈ ఎగ్జామ్ ద్వారా పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్స్/యూనివర్సిటీల్లో అడ్మిషన్స్ పొందే అవకాశం లభిస్తుంది. ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/సంబంధిత విభాగాలు), ఎంటెక్(బయోటెక్నాలజీ/ సంబంధిత విభాగాలు), ఎంవీఎస్సీ(యానిమల్ బయోటెక్నాలజీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ) 30 సీట్లు, ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ(మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్) 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ(ఫిజికల్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/అగ్రికల్చర్/వెటర్నరీ/ఫిషరీస్/ఫార్మసీ/ఇంజనీరింగ్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/జెనెటిక్స్/మైక్రోబయాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్)/ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీపీటీ/బీఈ/బీటెక్ (బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ఫుడ్ ఇంజనీరింగ్/ఫుడ్ ప్రాసెస్ టెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/జెనెటిక్ ఇంజనీరింగ్)/బీఎఫ్ఎస్సీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్(సైన్స్/అప్లయిడ్ సైన్స్)ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(జీఏటీ-బీ) వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే అడుగుతారు. ఇందులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో ఫిజిక్స్ కెమిస్ట్రీ మేథమెటిక్స్, బయాలజీ సబ్జెక్టుల నుంచి ఇంటర్ స్థాయిలో 60 ప్రశ్నలు ఇస్తారు. అన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు రెండో సెక్షన్‌లో బేసిక్ బయాలజీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, సంబంధిత విభాగాలనుంచి డిగ్రీ స్థాయిలో 100 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 60 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు మూడు మార్కులు ఉంటాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 240. పరీక్ష సమయం మూడు గంటలు.

బీఈటీ

ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా రెండు కేటగిరీల్లో మెరిట్ లిస్ట్‌లను రూపొందిస్తారు. మొదటి కేటగిరీ అభ్యర్థులకు డీబీటీ జేఆర్ఎఫ్ లభిస్తుంది. వీరు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీకి రిజిస్టర్ చేసుకోవచ్చు. ఫెలోషిప్ లెటర్ అందుకొన్న రెండేళ్లలోపు వీరు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో చేరాల్సి ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/బయోమెడికల్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయోకెమిస్ట్రీ/బయోఫిజిక్స్/బోటనీ/కెమిస్ట్రీ/కంప్యూటేషనల్ బయాలజీ/జెనెటిక్స్/మైక్రో బయాలజీ/ జువాలజీ స్పెషలైజేషన్‌లతో ఎమ్మెస్సీ/ఎంటెక్/ఎంవీఎస్సీ/ఎం.ఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పూర్తిచేసి ఉండాలి.

బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్(బీఈటీ) వివరాలు: ఇందులో కూడా రెండు సెక్షన్‌లు ఉంటాయి. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొదటి సెక్షన్‌లో జనరల్ సైన్స్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ, జనరల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ క్వాంటిటేటివ్ ఎబిలిటీ, జనరల్ బయోటెక్నాలజీ అంశాల నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. అన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో బయోటెక్నాలజీ అంశాల నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండు సెక్షన్లలో ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 300. పరీక్ష సమయం మూడు గంటలు.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 6
- **వెబ్‌సైట్:** www.nta.ac.in

మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి
నీట్ యూజీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) యూజీ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

నీట్ యూజీ వివరాలు: ఈ పరీక్షని ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ సహా వేరువేరు భాషల్లో నిర్వహిస్తారు. వీటిలో ఒకదాన్ని అభ్యర్థులు ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ ఎగ్జామ్‌లో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సబ్జెక్టులో రెండు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో 35 ప్రశ్నలు ఇస్తారు. వీటన్నింటికి సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో 15 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో ఏవైనా పదింటికి సమాధానాలు గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 720. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటల ఇరవై నిమిషాలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1700; ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000 ● **చివరి తేదీ:** మార్చి 9
- **నీట్ యూజీ 2024 తేదీ:** మే 5
- **వెబ్‌సైట్:** exams.nta.ac.in/NEET

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XUxbz3gలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

మిథున్ చక్రవర్తికి గుండెపోటు



ప్రముఖ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. శనివారం ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే కోల్‌కత్తాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యులు ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఆయనకు రెండేళ్ల క్రితం కిడ్నీల్లో సమస్య తలెత్తడంతో ఆపరేషన్ చేశారు. మిథున్ త్వరగా కోలుకోవాలని అభిమానులు ప్రార్థిస్తున్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం మిథున్ చక్రవర్తికి పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది. పలు బాలీవుడ్, బెంగాలీ చిత్రాల్లో నటించి హీరోగా స్టార్‌డమ్ అందుకున్నారు. వివాదాస్పద చిత్రం 'కశ్మీర్‌ఫైల్స్'లో మిథున్ చక్రవర్తి తనదైన శైలిలో నటించి మెప్పించారు.


ప్రేక్షకులకు గుర్తుండిపోయే చౌర్యపాఠం



రవితేజ కథానాయకుడిగా నటించిన 'ధమాకా' చిత్రంతో దర్శకుడిగా నక్కిన త్రినాథరావు పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఆయన నిర్మాతగా మారి 'చౌర్య పాఠం' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంద్ర రామ్ కథానాయకుడు. పాయల్ రాధాకృష్ణ హీరోయిన్. నిఖిల్ గొల్లమారి దర్శకుడు. దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని ఈ చిత్రానికి కథ అందించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్, టీజర్‌ని లాంచ్ చేసి ప్రచార కార్యక్రమాలు ప్రారంభించారు. గ్రామంలో దోపిడీకి హీరో తన ముఠాను సమాయత్తం చేయడంతో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ 'నక్కిన నెరేటివ్ బేనర్స్ ఈ రోజు ప్రారంభమైంది. దీనికి ప్రేక్షకులు ఊపిరి, భవిష్యత్‌ను ఇవ్వాలి. 'చౌర్య పాఠం'లో పాత్రలు ప్రేక్షకులకు గుర్తిండిపోతాయి' అన్నారు. ఈ సినిమా కోసం నాగేంద్ర 14 సెట్స్ వేశారని ఇంద్రరామ్ తెలిపారు. త్రినాథరావు ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించారని దర్శకుడు చెప్పారు.

క్రమశిక్షణ, నిజాయితీ ఆయన్ని ఉన్నత శిఖరాలకు చేర్చాయి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



'మురళీమోహన్‌లో నాకు నచ్చింది క్రమశిక్షణ, నిజాయితీ. జయాపజయాలను ఒక్కటిగా తీసుకోవడం ఆయన్ను ఉన్నత శిఖరాలకు చేర్చింది. యువత ఆయన్నుంచి ఇవన్నీ నేర్చుకోవాలి. వారు మంచి సందేశం ఉన్న సినిమాలు భవిష్యత్తులో మరిన్ని చేయాలని కోరుకుంటున్నాను' అన్నారు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. 'సకుటుంబ, సపరివార సమేతంగా చూసేలా సినిమాలు రాయండి, తీయండి. కుటుంబాలను, సంస్కృతి, సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకుని సినిమాలు నిర్మించండి' అని ఆయన కోరారు. 'పీవీ నరసింహారావు గారి ముందు చూపు వల్లనే నేడు దేశం ఇంత ముందుకు సాగింది. ఆయనకు భారతరత్న రావడం చాలా ఆనందకరమైన విషయం. చంద్రబాబు సంస్కరణల వల్లనే నేడు హైదరాబాద్ టెక్నాలజీ, ఫైనాన్షియల్, ఇండ్రస్ట్రీ హబ్‌గా మారింది' అని పేర్కొన్నారు వెంకయ్యనాయుడు. నటుడు, నిర్మాత మురళీమోహన్ 50ఏళ్ల సినీ జీవితం పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం శిల్పకళా వేదికలో గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరో ముఖ్య అతిథి చంద్రబాబు మాట్లాడుతూ 'ఏ పనైనా మనసుపెట్టి చేసే వ్యక్తి మురళీమోహన్. సినిమాల నిర్మాణంలో, రియల్‌ఎస్టేట్ రంగంలో ఆయన అద్భుతంగా రాణించారు. ఎంతో మందిని సొంత ఖర్చులతో చదివించి డాక్టర్లు, ఇంజనీర్లుగా తీర్చి దిద్దారు. ఇక వెంకయ్యనాయుడు గారి విషయానికి వస్తే ఆయన రాజకీయాల్లో సిన్సియారిటీకి మారుపేరుగా నిలిచారు. ఆయనకు పద్మ విభూషణ్, పీవీ నరసింహారావు గారికి భారతరత్న వంటి అత్యున్నత పురస్కారాలు రావడం మనందరికీ గర్వకారణం' అన్నారు.

ఎన్టీఆర్‌లోని అనేక మంచి లక్షణాలను ఆదర్శంగా తీసుకుని మురళీమోహన్ ఎంతో ఎత్తుకు ఎదిగారని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు . చివరిగా మురళీమోహన్ మాట్లాడుతూ.. 'నేను ఇవాళ ఈ స్థాయిలో మీ ముందు ఉన్నానంటే అట్లూరి పూర్ణచంద్రరావు గారు పెట్టిన భిక్షే. 1973లో ఆయన నాకు హీరోగా అవకాశం ఇస్తే, ఇండస్ట్రీలో నన్ను నిలబెట్టారు దాసరి గారు. వీరిద్దరినీ నా జీవితంలో మర్చిపోలేను' అన్నారు. 50 ఏళ్ల క్రితం తనకు తొలి అవకాశం ఇచ్చిన అట్లూరి పూర్ణచంద్రరావుకు ఈ సందర్భంగా మురళీమోహన్ ఒక కారును బహుమతిగా అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో నాటి హీరోయిన్లు ప్రభ, జయచిత్ర, కవిత, సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు, దర్శకుడు రాజమౌళి, నిర్మాతలు అశ్వినీదత్, సురేశ్‌బాబు, సంగీత దర్శకుడు కీరవాణి, నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామల, పార్లమెంట్ సభ్యులు రఘురామ కృష్ణంరాజు, సుజనా చౌదరీ, నటుడు ప్రదీప్, కొల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

నవ్య 'దృశ్యం' పేజిలోని మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/fR1qtvv లో చదవండి.

ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన జగన్


తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

● 1516వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 10: ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన నాయకుడు సీఎం జగన్‌రెడ్డి అని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. మూడు ముక్కల ఆటతో అభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శనివారం నాటికి 1516వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, సీఎం జగన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు నిలుపుదల చేయాలన్నారు. విశాఖ వెళతానని పదే పదే చెప్పే జగన్‌రెడ్డి ముందు అమరావతిని అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఏ మూలకైనా వెళ్ల వచ్చని రైతులన్నారు. మూడు రాజధానులనేది జగన్ రెడ్డి సొంత ప్రయోజనాల కోసమన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేయమని చెపుతున్నా పెడచెవిన పెడుతున్నారన్నారు. రేపు కోర్టు ధిక్కార కేసును సీఎం జగన్‌రెడ్డి ఎదుర్కోవాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

టీడీపీ, జనసేన.. గెలుపు ఖాయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు
● వెన్నాదేవిలో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ
● హాజరైన యరపతినేని, కన్నా, చదలవాడ తదితరులు


వెన్నాదేవిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కన్నా, యరపతినేని, జీవీ, చదలవాడ తదితరులు, సభలో మాట్లాడుతున్న కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవిలో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నరసరావుపేట ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబులు ఆవిష్కరించారు. పార్టీ పతాకాన్ని కన్నా లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. అనంతరం కన్నా అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో జీవీ మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో దోపిడీకి, అరాచకానికి పాల్పడిందన్నారు. గోదావరి, పెన్నానది అనుసంధానం పనులను ప్రభుత్వం నిలిపి వేసిందన్నారు. దీనివల్ల ప్రకాశం పల్నాడు జిల్లాలో రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు దోచుకోవటం తప్ప రైతాంగానికి చేసిన మేలు ఏమి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో పల్నాడు జిల్లాలో ఏడు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాన్ని గెలుచు కోవటం ఖాయమన్నారు. యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ అహంకారంతో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లపై విమర్శలు చేసిన వైసీపీ నేతలు రెండు నెలల తరువాత భారీ మూల్యం చెల్లించు కోక తప్పదన్నారు. సైకో పాలనలో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందన్నారు. రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా తయారు చేశారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఆంబోతు అంబటి రాంబాబును సాగనంపాలన్నారు. జనసేన, టీడీపీ కలయికతో రాష్ట్రంలో 155 స్థానాలతో ప్రభుత్వం ఏర్పాటు కావటం ఖాయమన్నారు. సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగుజాతికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్ విగ్రహన్ని ఆవిష్కరించు కోవటం చాలా సంతోషం అన్నారు. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా చేసి రాష్ట్రంలో అన్ని వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గ్రామ కమిటీ సభ్యులను కన్నా, యరపతినేని, జీవీ ఆంజనేయులు, చదలవాడ అరవిందబాబు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బహిరంగ సభలో సింహాద్రి యాదవ్, ఆళ్ళ అమరేశ్వరరావు, భీమినేని వందనాదేవి, గొర్రెపాటి సుశీల, నార్నెపాటి వెంకటరావు, పచ్చ సుధీర్, ముండ్రా శ్రీనివాసరావు, వెనిగళ్ళ వేదాద్రి, మల్లేశ్వరి, వేణు, భార్గవ్, పల్లపాటి పెద్దిరాజు, బత్తుల నాగేశ్వరరావు, రావిపాటి మధుబాబు, ఆళ్ళ సాంబయ్య, తోటకూర సాంబశివరావు, పున్నారావు, సత్తెనపల్లి మండల, నియోజక వర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ హోంమంత్రి సుచరితకు నిరసన సెగ


సుచరిత కాన్వాయ్‌ను చుట్టుముట్టిన తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 10: రాష్ట్ర మాజీ హోంమంత్రి మేకతోటి సుచరితకు గుంటూరు జిల్లా మంగళగిరిలో నిరసన సెగ తగిలింది. దగా డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి అంబేద్కర్ సెంటరులో నిరసన, మానవహారం జరుగుతున్న సమయంలో సుచరిత కాన్వాయ్ అటుగా వచ్చింది. దీంతో నిరసన తెలుపుతున్న యువకులు కాన్వాయ్‌ను చుట్టుముట్టి ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. వారిని నిలువరించే క్రమంలో పోలీసులకు, యువతకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. కారును ముందుకు పోనివ్వడంతో ఓ పోలీసు కిందపడిపోయారు. కాన్వాయ్‌లోని కార్లు వేగంగా వెళ్లే క్రమంలో ఓ కారు మరో కారును ఢీకొట్టింది. ఎట్టకేలకు పోలీసులు యువతను పక్కకుతప్పించి కాన్వాయ్‌కు లైన్‌క్లియర్ చేసి ముందుకు పంపించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

జగన్ ప్రభుత్వం రైతులను నిలువునా ముంచింది

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు


రైతులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

చుండూరు, ఫిబ్రవరి 10: రైతుల కష్టాల ముందు వారికి ఎంత చేసినా తక్కువే.. అలాంటిది జగన్ ప్రభుత్వం నమ్ముకున్న రైతులను నిలువునా ముంచిందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆరోపించారు. శనివారం సాయంత్రం మోదుకూరులో జరిగిన రైతు, పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ పంట రుణాలపై సున్నా వడ్డీ, పంటల బీమా, తుఫాన్ నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా ఇలా రైతు పథకాల క్రింద వేల కోట్ల రూపాయల బకాయిలు అందించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జగన్ వాటి ఊసే ఎత్తడం లేదని తెలిపారు. గతంలో తెలుగుదేశం పాలనలో లక్ష రూపాయల లోపు పంట రుణాలకు వడ్డీ కట్టే అవసరమే ఉండేది కాదు. జగన్ వచ్చిన తరువాత అణా పైసలతో సహా పంట రుణాలపై అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారన్నారు. కేంద్రం అందించిన మిచౌంగ్ తుఫాన్ రూ.493కోట్లు నష్టపరిహారాన్ని కూడా పంపిణీ చేయలేదన్నారు. అదేవిధంగా 2021నుంచి 2023వరకు ఖరీఫ్, రబీ కాలాలకు సంబంధించిన రైతులకు వడ్డీ రాయితీని కూడా ఇంతవరకు జమ కాలేదు. గత నాలుగున్నర సంవత్సరాల్లో పంట కాల్వల మరమ్మత్తులకు ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గూడేటి ఎల్లారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, ఆళ్ళ సుబ్బారెడ్డి, కొల్లి శ్రీనివాసరెడ్డి, కంఠంనేని రాహుల్, రాఘవరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

మంగళగిరి, ఫిబ్రవరి 10: దేశంలోని 18 రాష్ట్రాలలో ఎస్సీలుగా వున్న రజకులను ఏపీలో కూడా ఎస్సీలుగా గుర్తించాలని నేషనల్ ధోబీ మహాసంఘ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. తిరుమల శ్రీవారి పాదాల నుంచి బెజవాడ కనకదుర్గమ్మ ఆలయం వరకు ఆయన ప్రారంభించిన పాదయాత్ర శనివారం మంగళగిరి పట్టణానికి చేరుకుంది. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో చినకాకాని నేతన్న సర్కిల్ వద్ద పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. ఎస్సీ, బీసీ సంఘాల నాయకులు పాల్గొని పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు పేరూరి సత్యనారాయణ, వివిధ సంఘాల ప్రతినిధులు కట్టెపోగు ఉదయభాస్కర్, కొల్లూరు హనుమంతరావు, వుడతా శ్రీనివాసరావు, కాగితాల స్వాతి, తిరువీధుల కిరణ్, మంద్రు సత్యనారాయణ, దామర్ల నారాయణ, గొడ్డెలగల జయలక్ష్మీ, కొమ్మాకుల విజయభాస్కర్, కామరాజుగడ్డ సోమేశ్వరరావు, చాటపర్తి పోసిబాబు, వేముల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కొండవీడు ఉత్సవాలు


కొండవీడులో బెలూన్‌లు ఎగుర వేస్తున్న జాయింట్ కలెక్టర్

యడ్లపాడు, ఫిబ్రవరి 10: మండలంలోని కొండవీడు ఫెస్ట్ - 2024 ఉత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులతో కలసి జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్‌ప్రసాదు, అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎఫ్‌వో ఎస్.రామచంద్రరరావులు బెలూన్‌లు ఎగర వేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. కాగా కొండవీడు కోట పర్యాటక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కొండవీడు ఫెస్ట్ హెలిరైడ్‌క టిక్కెట్ ధర పెద్ద వారికి రూ.3,800, పిల్లలకు రూ.3,500గా నిర్ణయించినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కొండవీడు ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ


హిమబిందు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి10: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అధికసంఖ్యలో ఉత్తీర్ణత సాధించారని మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. మాస్టర్ మైండ్స్ విద్యార్థిని ఎ.హిమబిందు(హల్ టికెట్ నెం: 887474) 400 మార్కులకు గాను 347 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్టు మోహన్ తెలిపారు. అలాగే తమ విద్యాసంస్థలో 400కు గాను 300, ఆపైన సాధించిన 36 మంది విద్యార్థులు ఉన్నట్టు తెలిపారు. అలాగే దాదాపు 1000 మంది మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ అత్యున్నత బోధనా విధానం, క్రమశిక్షణ విద్యార్థుల విజయానికి కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మోహన్ అభినందించారు.

భవనం పైనుంచి దూకి విద్యార్థి బలవన్మరణం


విద్యార్థి వంశీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 10: ఎంటీఎంసీ పరిధిలోని ఓ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి శనివారం హాస్టల్ భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన బి.వంశీ సాయికృష్ణ సదరు యూనివర్సిటీలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. మధ్యాహ్న సమయంలో తాను ఉంటున్న హాస్టల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో వివరాలు తెలియరాలేదు. తాడేపల్లి సీఐ మధుసూదనరావు, ఎస్ఐ రమేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, విద్యార్థి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీవీకి భారతరత్న.. అభినందనీయం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించటం అభినందనీయమని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీవీ నరసింహారావు సంస్కరణల రూపశిల్పి అన్నారు. పలు హోదాల్లో దేశానికి అసమాన సేవలు అందించారన్నారు. అనేక సంవత్సరాల పాటు లోక్‌సభ, శాసనసభ్యునిగా ఆయన చేసిన సేవలు మరువులేనివన్నారు. దేశ ఆర్థికాభి వృద్ధిలో దూరదృష్టితో కూడిన ఆయన నాయకత్వం అతి కీలకపాత్ర పోషించిం దన్నారు. దేశ శ్రేయస్సుకు, అభివృద్ధికి బలమైన పునాది వేసిందన్నారు. ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఆయన అందించిన సేవలు మరువ లేనివని ఆయన పేర్కొన్నారు. పీవీకి భారత రత్న ప్రకటించడంపై ప్రధాని నరేంద్రమోదీకి కూడా కన్నా అభినందనలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

ప్రధాన రహదారిపై చెక్కుల పంపిణీ

● బందోబస్తు నిర్వహించిన పోలీసులు


స్థానిక రథం సెంటర్‌లో రోడ్డుపై టెంట్లు వేయడంతో ఇబ్బందులు పడిన ద్విచక్రవాహన చోదకులు, ప్రజలు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 10: అడుగడుగునా వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నప్పటికీ అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారు. డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక రథం సెంటర్‌లో శనివారం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం భట్టిప్రోలు గ్రామం నడిబొడ్డున మెయిన్‌రోడ్డుపై నిర్వహించారు. ద్విచక్రవాహన చోదకులు, పాదచారులు, వ్యాపారవర్గాలు, స్థానిక గృహాల్లో నివాసం ఉండే ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా ఎన్నిక కాకుండానే అధికారిక కార్యక్రమాల్లో నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు ఎలా పాల్గొంటారని పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి నాలుగు రోడ్లలో పోలీసులు దగ్గర ఉండి మరీ ట్రాఫిక్‌ను మళ్ళించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు వాహనాలతో బందోబస్తుగా సభాస్థలికి సమన్వయకర్త అశోక్‌బాబు కాన్వాయ్‌ను తీసుకురావడంపై రాజకీయ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికార దుర్వినియోగం జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కమ్మజన సేవాసమితికి రూ.5 లక్షల విరాళం


గోరంట్ల పున్నయ్యచౌదరికి చెక్కును అందజేస్తున్న డాక్టర్ బి.శారదాదేవి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 10: జేకేసీ రోడ్డులోని కమ్మజన సేవాసమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఒకగది నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం రూ.5 లక్షలను విరాళంగా నగరానికి చెందిన డాక్టర్ బి.శారదాదేవి ప్రకటించారు. ఈ సందర్భంగా శనివారం కమ్మజన సేవా సమితి కోశాధికారి గోరంట్ల పున్నయ్య చౌదరికి ఆమె చెక్కును అందజేశారు. అనంతరం శారదాదేవి మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు భైరవనేని వెంకటేశ్వరరావు, నాగేశ్వరమ్మల గౌరవార్థం ఈ విరాళాన్ని అందజేసినట్టు వివరించారు. దాదాపు 1,600 మంది బాలికలకు వసతి కల్పిస్తున్న సేవా సమితి సేవలు అభినందనీయమన్నారు. సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ కేజేఎస్ఎస్ 80జీ, 12ఏఏ, సీఎస్ఎస్ సర్టిఫికెట్లు కలిగి ఉన్నాయని, దాతలు ఇచ్చిన విరాళాలను పారదర్శకంగా వినియోగి స్తామని వివరించారు. త్వరలోనే భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన నడికూడి వడ్డెర సామాజికవర్గ నేతలతో యరపతినేని శ్రీనివాసరావు

టీడీపీలో చేరిన నడికూడి వడ్డెర సామాజికవర్గ నేతలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 10: దాచేపల్లి మండలం నడికూడి గ్రామ వడ్డెర సామాజికవర్గానికి చెందిన 30 కుటుంబాల వారు శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వైసీపీ గెలుపునకు తామెంతో కృషి చేసినా అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తమను పట్టించుకోకపోవడంతో పాటు మైనింగ్ లీజులను తన అనుచరులకే కేటాయించడంతో తీవ్ర అసంతృప్తికి గురై వైసీపీని వీడాల్సి వచ్చిందని నడికూడి గ్రామ మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. దేరంగుల రామ్మోహన్‌రావు, బత్తుల కృష్ణ, దేరంగుల రవి, వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి ప్రశాంత్‌తోపాటు మరికొందరికి మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా పొందుగల శివారు శ్రీనివాసపురంనకు చెందిన బొజ్జా వెంకట కృష్ణమూర్తికి యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నడికూడి వడ్డెర సామాజికవర్గ నేతలందరికీ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

పిన్నెల్లి టీడీపీ నేతలందరూ ఐక్యంగా పనిచేయాలి

వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీకి చెందిన వారెందరో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, కొద్ది రోజుల్లో వైసీపీ ఓటమిచెందడం ఖాయమని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన పార్టీ నాయకులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో యరపతినేని సమావేశమయ్యారు. వైసీపీ నాయకుల అరాచకాలతో సొంతూరు వదిలి ఐదేళ్లుగా మరో గ్రామంలో నివశిస్తున్న వారందరికీ తాను అండగా వుంటానన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు, ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

నడికూడి చర్చికి యరపతినేని రూ.లక్ష సాయం

నడికూడి గ్రామంలో సంఘ పెద్దల ఆధ్వర్యంలో నిర్మించిన క్రీస్తు లూథరన్ చర్చి ప్రతిష్ఠ మహోత్సవానికి గ్రామ సంఘ పెద్దలు యరపతినేనిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా యరపతినేని చర్చి కమిటీ సభ్యులకు రూ.లక్ష సాయం అందించారు. సంఘ పెద్దలు యరపతినేని శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటర్ల జాబితాలో తప్పు ఒప్పులను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి

● యరపతినేని సాయినిఖిల్

దాచేపల్లి, ఫిబ్రవరి 10: ఓటర్ల జాబితాలో ఉన్న తప్పు, ఒప్పులను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లపై ఉందని యరపతినేని సాయినిఖిల్ అన్నారు. దాచేపల్లిలోని విజయభాస్కర కల్యాణ మండపంలో శనివారం దాచేపల్లి నగర పంచాయతీలోని 37 బూత్‌ల ఓటర్ల జాబితాను పరిశీలించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ అక్కినపల్లి బాలయ్య పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో ఫారం-6, 7, 8లపై సమీక్ష నిర్వహించారు. 37 పోలింగ్ కేంద్రాలకు చెందిన బూత్ కన్వీనర్లు తమ బూత్‌లలో వున్న తప్పు ఒప్పులను పరిశీలించగా 1200 ఓట్లకు పైగా తేడా వున్నట్లు గుర్తించారు. వీటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి మార్పులు, చేర్పులు చేయించాల్సిన అవసరం ఉందని సాయినిఖిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ భద్రి, పఠాన్ మీరావలి, షేక్ జానీబాషా, రుద్రాల అచ్చారావు, భాస్కరరావు, మహ్మద్ రఫీ, ముంద్ర రామారావు తదితరులున్నారు.



దాచేపల్లిలో ఓటర్ల జాబితా పరిశీలనకు హాజరైన యరపతినేని సాయినిఖిల్, టీడీపీ నాయకులు

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా ఓబులు ఎన్నిక

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 10 : ఏపీ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ పిడుగురాళ్ల తాలూకా సమావేశం శనివారం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు అధ్యక్షతన నరసరావుపేటలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఎస్.కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన సంఘ సమావేశంలో పిడుగురాళ్ల తాలూకా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా సంద్రపాటి ఓబులు, ఉపాధ్యక్షుడిగా ఎస్‌డి మొహిద్దీన్, కార్యదర్శిగా జి.నరసింహారావు, మురికిపూడి ప్రసాదరావు, రాజారావు, అన్నపూర్ణ, శివన్నారాయణ తదితరులను ఎన్నుకున్నారు.

చంద్రబాబుతోనే మహిళలకు రక్షణ

● తెలుగు మహిళా అధ్యక్షురాలు పరుచూరి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తేనే మహిళల ఆత్మగౌరవం, రక్షణ కలుగుతుందని పిడుగురాళ్ల మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు పరుచూరి వెంకటరమణ తెలిపారు. శనివారం రాత్రి బ్రాహ్మణపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మేనిఫెస్టోలోని పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించడంతో పాటు భవిష్యత్‌కు గ్యారంటీ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రావి వెంకటరమణ, కొంకా రాధ, జనగాం గురువర్ధన్, మాజీ ఎంపిటిసి యరగాని వెంకటేశ్వర్లు, బడిగుంచల సాంబశివరావు, యరగాని శ్రీనివాసరావు, విశాలాక్షి, సైదమ్మ, నాంచారమ్మ, అనంతలక్ష్మీ, పొన్నం విజయ్, యరగాని అంకారావు, రవి, ఉసిరికాయల ఆదినారాయణ, తదితరులున్నారు.

మాచవరంలో ఉచిత వైద్యశిబిరం

మాచవరం, ఫిబ్రవరి 10 : మాచవరంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం ముజావర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. నరసరావుపేట శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ముజావర్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ షేక్ షరీఫ్ ముజావర్, హాస్పటల్ వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహించారు.

టీడీపీ బ్యానర్ చించివేత



టీడీపీ బ్యానర్‌ను చించిన చిత్రం

మాచవరం, ఫిబ్రవరి 10: మండలంలోని రేగు లగడ్డ గ్రామంలో తెలుగు దేశం పార్టీకి సంబంధించి బ్యానర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం చించివేశారు. ఇటీవల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు యరపతినేని, చంద్రబాబు, లోకేశ్, మండల నాయకులు, గ్రామ నాయకుల ఫొటోలతో బ్యానర్ ఏర్పాటు చేసుకొని ప్రధాన రహదారిలో ఏర్పాటు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు బ్యానర్‌ను చించి ప్రధాన రహదారిలో పడవేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి మాచవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యల మహాజ్యోతి ప్రదర్శన

దాచేపల్లి, ఫిబ్రవరి 10 : మండలంలోని కేశానుపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో అఖండ జ్యోతితో గ్రామంలో తిరిగారు. మాలధారణ స్వాములు, దీక్షా స్వాములు, భక్తులు శనివారం అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి తమ మొక్కులు తీర్చుకున్నారు. లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. గురుస్వాములు పోతురాజు నరసింహారావు, వల్లేరు గంగరాజు, బేతంచర్ల కోనరావు తదితరులు కార్యక్రమానికి సహకరించారు. ఈ సందర్భంగా స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు.

న్యాయమూర్తి షర్మిల మృతి

గురజాల లీగల్, ఫిబ్రవరి 10: గురజాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి డి.షర్మిల (42) కొద్దిరోజులుగా జ్వరంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో శనివారం మృతి చెందారు. గత ఏడాది నుంచి గురజాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తిగా పని చేస్తున్న షర్మిల మృతికి స్థానిక న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు సంతాపం తెలిపారు.

భవిష్యత్తు తెలుగుదేశం పార్టీదే : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10 : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని రెంటపాళ్లలో శనివారం వైసీపీ నుంచి కొమెర శ్రీను ఆధ్వర్యంలో 20 బీసీ కుటుంబాలు తెలుగు దేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, అమరావతి రాజధానిగా కొనసాగుతుందన్నారు. పార్టీలో చేరిన వారందరికీ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆళ్ల అమరేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరావు, ధనేకుల సాంబయ్య, చెన్నమల్లు మోహన్‌బాబు, బత్తుల వెంకటస్వామి, అచ్చి శ్రీను, మాడిశెట్టి రామ సైదులు, పలువురు తెలుగుదేశం, జనసేన నాయకులు పాల్గొన్నారు. వైసీపీ నేత మక్కపాటి సుబ్బారావు కూడా టీడీపీలో చేరారు. ఆయనకు కన్నా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

చిన్నయ్య కుటుంబాన్ని పరామర్శించిన కన్నా

రాజుపాలెం, ఫిబ్రవరి 10 : మండలంలోని ఆకులగణపవరం గ్రామానికి చెందిన గుండెగ చిన్నయ్య(72) గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆకులగణపవరంలోని మృతుడు చిన్నయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కన్నా మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కారం కావాలంటే తెలుగుదేశం అధికారంలోకి రావాలన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, మాజీ ఎంపీపీ నర్రా బాబురావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్రా మల్లయ్యచౌదరి, మద్దు నాగరాజు, బాలస్వామి, దొండపాటి లాజర్, పొలిశెట్టి కోటేశ్వరరావు, మొరసా శ్రీను, మండల తెలుగుయువత అధ్యక్షులు కుర్రా మల్లి, బొడ్డెంపూడి లక్ష్మీనారాయణ, నల్లూరి మోహన్‌రావు ఉన్నారు.



టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ



విఘ్నేశ్వరుని కలశాలతో ప్రదక్షిణ చేస్తున్న బ్రహ్మారెడ్డి దంపతులు

ఘనంగా విఘ్నేశ్వరుని ఆలయ వార్షికోత్సవం

పాలువాయిజంక్షన్, (రెంటచింతల)ఫిబ్రవరి 10 : పాలువాయిజంక్షన్‌లో ఉన్న సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకుని ఆలయ 20వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గణపతి శాస్త్రి నేతృత్వంలో వేకువ జామునుంచే సుప్రభాతసేవ, లక్ష్మీగణపతి హోమం, పంచామృతాభిషేకాలు, కల్యాణం నిర్వహించారు. పలువురు దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త పాశం లచ్చిరెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు వందలాది మందికి అన్నదానం చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

పూజల్లో పాల్గొన్న బ్రహ్మారెడ్డి

వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షికోత్సవంలో టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. తొలుత లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయం వెలుపల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అరాచకాన్ని అణచివేస్తానని ప్రతి ఒక్కరి హక్కులను కాపాడతానని, ఆస్తులకు రక్షణ కల్పిస్తానని హామీనిచ్చారు. ఎన్నికల శంఖారావాన్ని స్వామి సన్నిధి నుంచే పూరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ విలేకరుల సమావేశంలో కుమారుడు గౌతంరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శొంఠిరెడ్డి నాగమ్మ నర్సిరెడ్డి, ప్రభురాజ్ యాదవ్, బోడపాటి రామకృష్ణ, బ్రహ్మం గౌడ్, అల్లం బ్రహ్మారెడ్డి, అప్పయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

రెంటచింతల, ఫిబ్రవరి 10 : జగజ్జనని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ నేతృత్వంలో వేకువజామున సుప్రభాతసేవ, ఆర్యవైశ్య పతాకావిష్కరణ, 102 మంది కన్యలతో గణపతి పూజ, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భగవద్గీత పారాయణం, అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

గురజాలటౌన్, ఫిబ్రవరి 10 : పట్టణంలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో నవులూరి బ్రహ్మ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శిబిరంలో క్యాన్సర్, ఆర్థోపెడిక్, యూరాలజీ, జనరల్ మెడిసిన్, ప్రసూతి స్త్రీల వ్యాధి, గుండె పరీక్షలు, ఊపిరితిత్తులు, కంటి, చర్మవ్యాధుల నిపుణులు పాల్గొని వైద్య సేవలందించనున్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

మాచర్ల, ఫిబ్రవరి 10 : నియోజకవర్గ పరిధిలోని పలువురు అనారోగ్య కారణాలతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 12.50 లక్షల విలువైన చెక్కులు మంజూరయ్యాయి. వీటిని శనివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లబ్ధిదారులకు అందించారు. దుర్గి మండలం పోలేపల్లికి చెందిన గౌరెడ్డి ప్రతాపరెడ్డికి రూ.2.50 లక్షలు, చేమికల వెంకటసుజాతకు రూ.లక్ష, మాచర్లలోని ఎల్‌పీ కాలనీకి చెందిన కొణతం శ్రీనివాస్‌కు రూ.9 లక్షల విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు, మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే

ఆసరా చెక్కుల పంపిణీ

వెల్దుర్తి, ఫిబ్రవరి 10 : వెల్దుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జగనన్న ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని మండలంలోని 640 స్వయం సహాయ సంఘాల్లోని 6404 మంది మహిళలకు రూ.3.76 కోట్ల విలువైన చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, ఎంపీపీ చింతా శివరామయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, బాలునాయక్, సొసైటీ అధ్యక్షుడు పుల్లారెడ్డి, గుంటక చెన్నారెడ్డి, పులుసు నారాయణరెడ్డి, మేకల కోటిరెడ్డి, శీలం సైదారెడ్డి, బలిగొడుగుల శ్రీనివాస్ యాదవ్, రామాంజి యాదవ్ పాల్గొన్నారు.

గ్లోరీ ఆఫ్ క్రైస్ట్ చర్చి అభివృద్ధికి కృషి చేస్తా : పీఆర్కే

విజయపురిసౌత్, ఫిబ్రవరి 10: స్థానిక గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం చర్చిలో జరిగిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దానియేలు, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు, మాజీ జడ్పీటీసీ శేర్రెడ్డి గోపిరెడ్డి, తాళ్లపల్లి సర్పంచ్ యంగ్రాలయ్య, సిస్టర్ మహిమాదానియేలు, రిటైర్డ్ డీఈ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య, తంగిరాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసమర్థ ముఖ్యమంత్రిని సాగనంపుదాం : టీడీపీ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10 : రానున్న ఎన్నికల్లో అసమర్థ ముఖ్యమంత్రిని సాగనంపుదామని టీడీపీ నేతలు ఆళ్ల సాంబయ్య, పూజల వెంకట కోటయ్య, కంభాల వెంకటేశ్వరరావు, ద్వివెల శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ ప్రజా వేదికలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రైతుల గురించి పట్టించుకోని మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌లను పల్నాడు ప్రజలపై రుద్దాలనుకోవటం భ్రమ అన్నారు. నియోజకవర్గంలో మంత్రి అంబటికి గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు.

జనసేనలో చేరిన డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్



నాగబాబు సమక్షంలో జనసేనలో చేరిన డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్

నకరికల్లు, ఫిబ్రవరి 10 : జనసేన పార్టీలో ఏపీ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్, జనసేన పీఏసీ సభ్యుడు, జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు సమక్షంలో విశాఖ అర్బన్ అధ్యక్షుడు, ఎంఎల్‌సీ వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం విఫలమైందని శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

నకరికల్లు, ఫిబ్రవరి 10 : నకరికల్లు రామదాసు కాలనీలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం 8:43 గంటలకు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవంలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

విద్యార్థి దశలో పదవ తరగతి కీలకం

నకరికల్లు, ఫిబ్రవరి 10 : విద్యార్థి జీవిత దశలో పది పరీక్షలు కీలకమైనవని చేజర్ల ఎస్‌వీఎస్‌ఆర్ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం షేక్ పాహిం అన్నారు. శుక్రవారం రాత్రి చేజర్ల హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొడ్డపాటి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.లలిత, మల్లిక, మోహనరావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్‌కే మస్తాన్‌వలి, ఎస్‌కే హబీబ్, జేసీహెచ్ వెంకటరావు, జీ.సుందరరావు, షేక్ గౌస్, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

104 సేవలను వినియోగించుకోవాలి

నకరికల్లు, ఫిబ్రవరి 10 : ప్రభుత్వం 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని కుంకలగుంట పీహెచ్‌సీ డాక్టర్ ఎం.పూజశ్రీ అన్నారు. జల్లాపేట తండాలో 104 వాహనం ద్వారా హాజరైన వారికి శనివారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎం.రత్నకుమారి, ఆశా కార్యకర్తలు సీత, పుష్ప, పద్మావతి పాల్గొన్నారు.

వ్యవసాయ సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు

క్రోసూరు, ఫిబ్రవరి 10 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, వ్యవసాయ రంగ సమస్యలను గాలికి వదిలివేసిందని సీపీఎం, సీపీఐ, రైతు సంఘం, కౌలు రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం భూ హక్కుల చట్టాన్ని ఉపసంహరించుకోవటంతో పాటు చుక్కల భూములకు, బంజర్ భూములకు పట్టాలు ఇవ్వాలని, ఆదివాసీల హక్కులు కాపాడాలని, సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంఘం నాయకులు ఆవుల ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంజిమాల రవిబాబు, కౌలు రైతు సంఘం నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావు, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు పెద్దబ్బాయి చౌదరి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఇబ్రాయేలు, ఆటో యూనియన్ నాయకులు జగన్నాథం పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు విప్రో ఎర్తియన్ అవార్డులు

కారంపూడి, ఫిబ్రవరి 10 : స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు విప్రో సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన విప్రో ఎర్తియన్ అవార్డు పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. విద్యార్థులు మహాలక్ష్మి, భవాని, అరుణ్‌కుమార్, జుబెదా, కౌశిక్‌లు వేస్ట్ మేనేజ్‌మెంట్ థీమ్‌పై ప్రాజెక్టును సమర్పించినట్లు గైడ్ టీచర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శనివారం విజయవాడలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి నుంచి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందుకున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ నయామి అభినందించారు.

పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డుపై హర్షం

మాచర్ల, ఫిబ్రవరి 10 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై శ్రీగాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన హర్షం వ్యక్తం చేశారు. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దండంరాజు వెంకట హనుమంతురావు, సాగి వెంకటశివనాగరాజు, మాదిరాజు బాబు శ్రీనివాసరావు, గండ్రకోట శ్రీనివాసరావు, సాగి వెంకటేశ్వర శాస్త్రి, దివాకరుని ప్రసాద్, సోమరాజు మధు, మారుతీరావు, స్వామి ప్రసాద్, దేవరకొండ రాము, కిరణ్, రవి ప్రకాష్ పాల్గొన్నారు.

చెట్టు మీద నుంచి పడి వ్యక్తి మృతి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10 : చెట్టు మీద నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో శనివారం జరిగింది. అచ్చంపేట రోడ్డులో నివశిస్తున్న పసుపులేటి నాగరాజు(42) తన ఇంటి ఎదురుగా ఉన్న చింత చెట్టుపైకి చింతకాయలు కోసేందుకు తన స్నేహితులతో కలసి ఎక్కాడు. చింతకాయలు కోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

వైసీపీ అరాచకాలపై లోకేశ్ శంఖారావం

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి10: రాష్ట్రంలో సీఎం జగన్ చేస్తున్న అరాచకాలపై శంఖారావం కార్యక్రమానికి టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేటి నుండి శ్రీకారం చుడుతున్నట్లు గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం సభలతో పర్యటించి జగన్ ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాల గురించి ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేయనున్నారన్నారు. రానున్న 40 నుండి 50 రోజులలోపు 120 అసెంబ్లీ నియోజకవర్గాలలో లోకేశ్ పర్యటించనున్నారన్నారు. ఒక్కో రోజు మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలో శంఖారావం సభలు జరుగుతాయని, సభల ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వైసీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అన్యాయాలు, దౌర్జన్యాలు, ధరల పెంపును వివరించడంతో పాటు బాబు హామీ - భవిష్యత్‌లో హామీగా ప్రజల్లోకి, ఇంటింటికి చేరువవుతారని యరపతినేని తెలిపారు. ఇప్పటికే యువగళం పాదయాత్రతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో, పట్టణాలలో లోకేష్ పర్యటనకు అనూహ్య వచ్చిందని, వైసీపీ అవినీతి అన్యాయాలకు వ్యతిరేకంగా 220 రోజుల పాటు 3,132 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం జరిగిందన్నారు.

లోకేశ్ శంఖారావం.. ప్రజలకు భరోసా

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఫిబ్రవరి 10: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావమని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలిజేస్తారన్నారు. నిరుద్యోగంతో యువత, ధరల పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు టీడీపీ శంఖారావం చేపట్టనున్నారన్నారు. బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ హామీ కార్యక్రమంలో ప్రకటించిన సూపర్ - 6 పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంటికి చేరువవుతారన్నారు. శంఖారావం పార్టీ కార్యకర్తలు నారా లోకేశ్ వైపు మరింత చేరువయ్యేలా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కార్యకర్తలు నారా లోకేశ్‌తో తమ అభిప్రాయాలను పంచుకొనే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

తెలుగుదేశం హయాంలోనే సమస్యలు పరిష్కారం

● చిట్యాల నిర్వాసితులతో దళిత నేతలు

రాజుపాలెం, ఫిబ్రవరి 10 : మా కాలనీలో కరెంటు లేదు.. మంచినీరు లేదు. గతంలో ఎన్నికల ముందు ఇలాగే రాజకీయ పార్టీల నాయకులు వచ్చి తాము అధికారంలోకి వస్తే మీ సమస్యల మొత్తం పరిష్కరిస్తామని చెప్పి వెళ్లి గెలిచిన తర్వాత ఇటువైపు వచ్చిన పాపాన పోలేదని చిట్యాల నిర్వాసితులు(దళితులు) ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కొత్త బోధనం గ్రామంలో నియోజకవర్గంలోని ఎస్సీ నాయకులు, కార్యకర్తలు శనివారం దళిత చైతన్య యాత్ర నిర్వహించారు. చిట్యాల దళితవాడలో యాత్ర చేస్తున్న క్రమంలో అక్కడి నిర్వాసితులు తమ ఎదుర్కుంటున్న సమస్యలను ఎస్సీ నాయకుల దృష్టికి తీసుకురాగా మీ సమస్యలు పరిష్కారం కావాలంటే రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. మన బిడ్డల భవిష్యత్ కోసం చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీను, బండారు నాగరాజు, వాసా వెంకటేశ్వర్లు, చాట్ల దేవదాసు, ఆశీర్వాదం, కోట జోసఫ్, మురికిపూడి కమలాకర్, గుడిపాటి సుధాకర్, కావూరి కోటయ్య, మేరుగు రత్తయ్య, వేమవరపు వెంకయ్య, తోట హరి, ఉగ్గం శ్రీను, చిమట సైదారావు, వేల్పుల నరసింహారావు తదితరులు ఉన్నారు.



కొత్త బోధనం గ్రామంలో దళిత చైతన్య యాత్ర నిర్వహిస్తున్న దళిత నాయకులు, కార్యకర్తలు

గుడిపాడులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ

క్రోసూరు, ఫిబ్రవరి 10 : మండలంలోని గుడిపాడు గ్రామంలో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేయటమే కాక మన ఇంటికి మన కొమ్మాలపాటి కరపత్రాలను కూడా అందించారు. నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు తోకా వెంకటరావు, అనంతవరం సర్పంచ్ పిల్లకతుపుల రామయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. మినీ మేనిఫెస్టోలోకి అంశాలు అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే అమలు చేయటం జరుగుతుందని, రాష్ట్రంలో అరాచక పాలన అంత మొందించాలంటే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలందరూ అంకిత భావంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

● జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

రాజుపాలెం, ఫిబ్రవరి 10 : కాచి చల్లార్చిన నీటిని తాగాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ చెప్పారు. రాజుపాలెంలో ఉన్న మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రవీంద్ర రత్నాకర్ మలేరియా ల్యాబ్‌లో జరిగే రక్త పరీక్షల వివరాలను, రికార్డు, రిపోర్టును పరిశీలించారు. అనంతరం పునరావస కేంద్రంలోని ప్రజలతో మాట్లాడుతూ మీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, అందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధులు వ్యాపిస్తాయని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కృష్ణకుమార్, సత్తెనపల్లి సబ్ యూనిట్ పర్యవేక్షకులు రోశయ్య, ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు జీవనరావు, ల్యాబ్ టెక్నీషియన్ రమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు హుస్సేన్, లక్ష్మీతిరుపతమ్మ ఉన్నారు.

బెస్ట్ అవార్డు అందుకున్న శ్రీనివాసరావుకు ఘన సన్మానం

అచ్చంపేట, ఫిబ్రవరి 10 : మండలంలోని కోనూరు గ్రామంలో పశువుల ఆస్పత్రి సహాయకుడిగా పని చేస్తున్న పరిమి శ్రీనివాసరావును అచ్చంపేట, క్రోసూరు మండలాల రజక సంఘ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. నీలేశ్వరపాలెం లోని గిరిజా నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా బెస్ట్ అవార్డును జేడీ కే.కాంతారావు చేతుల మీదుగా అందుకున్న నేపథ్యంలో రజక సంఘ నాయకులు సన్మానించారు. సంఘ నాయకులు భీమవరపు బ్రహ్మయ్య, ఓగిరాల అక్కారావు, పలకలూరి బొల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా పరిమి శ్రీనివాసరావు దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీ.స్వాతిదేవి, పశుగణ అధికారి స్వర్ణకుమారి, పశుగణ సహాయకులు కంభాల శ్రీనివాసరావు, కోనూరు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి కన్నా నివాళులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10 : పట్టణంలోని 11వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త కొండవీటి వెంకటేశ్వరరావు దశ దిన కర్మ శనివారం పట్టణంలోని రఘురామ్ నగర్‌లో జరిగింది. టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు టీడీపీ నేతలు నూర్‌బాషా జానీబాబు, చుక్కపల్లి కేశవరావు, గుజ్జర్లపూడి సతీష్, మన్నవ శారదాదేవి ఉన్నారు. కాగా మండలంలోని రెంటపాళ్ళలో చెన్నమల్లు రాధాకృష్ణమూర్తి దశదిన కర్మలో కన్నా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట గ్రామ, మండలానికి చెందిన టీడీపీ నేతలు ఉన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా వెంగళరావు

మాచవరం, ఫిబ్రవరి 10: మాచవరం మండలం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా డి.వెంగళరావు నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన వర్రప్రసాద్ ఎన్నికల బదిలీలలో భాగంగా ప్రకాశం జిల్లాకు వెళ్లారు. మాచవరంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న వెంగళరావును ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి.

పల్నాడు వార్తలు

చెకుముఖి సైన్స్ సంబరాలు ప్రారంభం

● ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీలు గేయానంద్, లక్ష్మణరావులు



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

యడ్లపాడు, ఫిబ్రవరి 10: మండలంలోని యడ్లపాడు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 34వ చెకుముకి సైన్స్ సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజున అతిథులుగా మాజీ ఎమ్మెల్సీలు డాక్టర్ ఎం గేయానంద్, కేఎస్ లక్ష్మణరావులు హాజరై జాతీయ, జేవీవీ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ మనుగడకు సైన్స్ ఎంతో అవసరమన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు పీ జగదీష్ చంద్రారెడ్డి, శ్రీనివాసరావు, ఏఎన్‌యూ ప్రొఫెసర్ ఏవీవీ ఎస్ స్వామి, ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, కార్యదర్శి జయప్రకాష్ తదితరులు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. శ్రీహరి కోట నుంచి వచ్చిన వైజ్ఞానిక మొబైల్ బస్సును పలు పాఠశాలల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దార్ల బుచ్చిబాబు, సజన, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలకు సర్వం సిద్ధం

● పల్నాడు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం నీలావతిదేవి



ఎం నీలావతిదేవి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 10 : ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేసినట్లు పల్నాడు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం నీలావతిదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు సంబంధిం చిన ఎగ్జామినర్స్, చీఫ్ సూపరిండెంట్స్‌ను ఇంటర్మీడియట్ బోర్డు నియమించిందన్నారు. నియామక పత్రాలను తీసుకుని సంబంధిత పరీక్ష కేంద్రానికి హాజరై పరీక్షలు సజావుగా జరగడానికి ఏర్పాట్లు చేశారని అన్నారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, సమస్యలు ఉంటే పల్నాడు జిల్లా కంట్రోల్ రూమ్‌కు 08647- 223355 సంప్రదించి తెలియజేయాలన్నారు.

అర్హుల ఓట్లు తొలగించేందుకు కుట్రలు

● నకిలీ ఓట్లను ఆధారంగా చూపుతున్నారు

● డబుల్ ఎంట్రీలంటూ బీఎల్వోలపై ఒత్తిడి

కారుమంచి(శావల్యాపురం), ఫిబ్రవరి 10: వివిధ గ్రామాల్లో ఒకే పేరుతో ఉన్న నకిలీ ఓట్లను ఆధారాలుగా చూపించి డబుల్ ఎంట్రీలు ఉన్నాయంటూ అధికారులు, బీఎల్వోలను ఒత్తిడి చేసి అర్హులైనవారి ఓట్లు తొలగించేందుకు అధికార పార్టీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆరోపించారు. కారుమంచిలో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలోనే ఇళ్ళు పొలాలు ఉండి బతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వ్యక్తుల ఓట్లు తొలగించేందుకు గ్రామానికి చెందిన అధికారపార్టీ నాయకుడు ఇదుపులపాటి హనుమంతరావు ఆన్‌లైన్‌లో అదేపేరుతో ఉన్న ఓట్లను వెతికి దాన్ని అధికారులు, బీఎల్వోలకు చూపించి ఓట్లు తొలగించాలని వారిని ఒత్తిడి చేస్తున్నాడని, కారుమంచిలోని 137వ బూత్‌లో ఓటున్న పురుషుడు గుర్రం రమణకు విజయవాడ 170వబూత్‌లో మహిళ గుర్రం రమణ పేరుతోనున్న ఓటును ఆధారంగా చూపించడంతోనే ఆయన చేస్తున్న అక్రమాలు బట్టబయలయ్యాయన్నారు. గ్రామంలో పెళ్ళయిన మహిళల ఓట్లు టీడీపీ వారివి 15మందివి తొలగించారని, 10మంది వైసీపీ వాళ్ళవి అలానే ఉంచారన్నారు. గ్రామానికి చెందిన బత్తుల లక్ష్మికి ఐదుచోట్ల ఓట్లున్నాయని చెబుతున్నారని, ఆమె స్థానికంగానే ఉన్నట్లు అధికారుల విచారణలో తేలినా నెలకోసారి ఆమె ఓటు తొలగించేందుకు ఫారం-7 పెడుతున్నారన్నారు. తుది జాబితా వెలువడిన తరువాత కూడా 50మంది టీడీపీ ఓట్లు తొలగించేందుకు ఫారం-7లు పెట్టాడని, వాటిలో గ్రామానికి చెందిన 5వవార్డు సభ్యుడు వరగాని కిషోర్ ఓటును తొలగించేందుకు కూడా ఫారం-7 పెట్టడం గమన్హామన్నారు. అధికారులు పారదర్శకంగా విచారణ చేసి డబుల్ ఎంట్రీలు ఉన్నాయని తేలితే ఓటర్ల అభిప్రాయాన్ని బట్టి ఎక్కడ ఓటుండాలో తెలుసుకొని రెండోచోట తొలగించాలని కోరారు. టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు ముప్పా గిరిప్రసాద్, ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోట హరిబాబు, గోపాళం ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వర్మ



డీఎస్పీ వర్మ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 10: ఇటీవల నరసరావుపేట డీఎస్పీగా బదిలీ అయిన వర్మ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన డీఎస్పీగా కోవూరు, విజయవాడలలో సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటానన్నారు.

టీడీపీ నాయకుడు సుబ్బారావు మృతికి సంతాపం

ఈపూరు, ఫిబ్రవరి 10: మండలంలోని ముప్పాళ్ళకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పోట్లూరి సుబ్బారావు మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు దండే కోటేశ్వరరావు, జాస్తీ బుచ్చారావు, దండే సురేష్, సూరే కోటేశ్వరరావు, అప్పారావు, గుంటకల శ్రీను, శీలం సురేష్, శ్రీరాములు, పూజల కొండలు, పులుకూరి చిన్న వీరయ్య, శ్రీనివాసరావులు సుబ్బారావు మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.

ఈపూరులో మిరప కాయలు చోరీ

ఈపూరు, ఫిబ్రవరి 10: పొలంలో ఆరబెట్టిన మిరపకాయలు చోరీకి గురైన సంఘటన ఈపూరులో జరిగింది. గ్రామానికి చెందిన మద్దం కుటుంబరావు, గంజనబోయిన గణపతిలు పొలంలో మిరప కాయలు ఆరబెట్టినారు. కుటుంబరావుకు చెందిన సుమారు 10 క్వింటాలు, గణపతికి చెందిన సుమారు 3 క్వింటాలు చోరీ చేశారు. చోరీ కి గురైన మిరప కాయల విలువ సుమారు రూ.2.60 లక్షలు ఉంటాయన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

వరుస చోరీలతో ఆందోళన

కారుమంచి(శావల్యాపురం), ఫిబ్రవరి 10: మండలంలోని కారుమంచి గ్రామంలో వరుస చోరీలతో గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. గ్రామంలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం దేవాలయంలోకి చొరబడి కంచుతో తయారు చేసిన 8కిలోల గంటను, శివాలయం తరపు న చెరువుకట్టపై నిర్మిస్తున్న గదుల కట్టుబడి కోసం తెచ్చిన 10 సిమెంట్ కట్టలను కూడా అపహరించారు. కాల్వకట్టపై సోమేపల్లి హనుమంతరావు పొలానికి నీటికోసం ఏర్పాటు చేసుకొన్న నీళ్ళ మోటర్‌ను కూడా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించగా శనివారం పొలానికి వెళ్ళిన హనుమంతరావు నీళ్ళమోటర్ లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టపగలే ఇలా చోరీలు జరగడంతో గ్రామస్థులలో ఆందోళన నెలకొంది. పోలీసులు సంఘటనా స్థలాలను సందర్శించి బాధితుల నుంచి వివరాలు సేకరించి నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైకుపై వెళుతున్న వ్యక్తిని ఆపి నగదు దోపిడీ

శావల్యాపురం, ఫిబ్రవరి 10: బైకుపై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు ఆపి అతని వద్ద నగదు దోపిడీ చేసిన ఘటన గుంటూరు - కర్నూలు జాతీయ రహదారిపై కనమర్లపూడి గ్రామసమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శావల్యాపురం మండలం పొట్లూరు గ్రామానికి చెందిన హరిబాబు ప్రతిరోజూ వినుకొండకు వెళ్ళి మెకానిక్ పనిచేసుకొని సాయంత్రానికి స్వగ్రామమైన పొట్లూరుకు తిరిగి వస్తుంటాడు. అదే క్రమంలో శుక్రవారం రాత్రి కూడా పనులు ముగించుకొని బైకుపై ఇంటికి బయలుదేరాడు. కనమర్లపూడి సమీపానికి రాగానే ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బైకును ఆపారు. హరిబాబును గట్టిగా పట్టుకొని అతని జేబులోనున్న రూ.4వేల నగదు, మొబైల్ ఫోన్‌ను లాగేసుకొని అక్కడి నుండి ఉడాయించారు. హరిబాబు వెంటనే శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే తరహాలో వినుకొండ సమీపంలో మరొకరిని కూడా దోపిడీ చేసినట్లు సమాచారం. నిరంతరం వాహనాలతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై బైకును ఆపి నగదు దోచుకోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ చల్లా సురేష్ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తశుద్ధి ఉంటే భూ ఆక్రమణలపై విచారణ జరిపించాలి

● స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి భూబకాసురుడు

● 46 ఎకరాల అసైన్డ్ ల్యాండ్ కలుపుకొని వెంచర్లు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 10: నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి భూబకాసురుడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. శనివారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఉప్పలపాడు రోడ్డులో సాయి బాలజీ దాదాపు 200ఎకరాల వెంచర న్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనినివాసరెడ్డి, షేక్ కార్పొరేషన్ ఛైర్మన్ షేఖ్ కాజావలి, మరికొంత మంది కలిసి వేంచర్ వేశారన్నారు. ఈ వెంచర్‌లో దాదాపు 46ఎకరాలు ప్రభుత్వ భూమి ఎసైన్డ్ ల్యాండ్ ఉందన్నారు. ఎసైన్డ్ ల్యాండ్ కలుపుకొని వేంచర్ వేశారని అన్నారు. ప్రతి ఎకరం రూ.5 కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఆ వేంచర్‌లో చంద్రమౌలేశ్వరి దేవాలయానికి చెందిన 3.5ఎకరాలు ఉందని, ఎన్ఎస్‌పీ కాలువ దాదాపు ఆరు ఎకరాలు, డొంకరోడ్డు 9.5ఎకరాలు, కుంట భూమి ఆరు ఎకరాలు, మిగులు భూమి 14ఎకరాలు, కుమ్మరి, వడ్రంగి ఇనామ్ భూములు 14 ఎకరాలున్నాయన్నారు. ప్రభుత్వ భూమి ఎమ్మెల్యే ఆక్రమించుకోవాడానికి లేదన్నారు, ఎమ్మెల్యే ఒక భూబకాసురుడన్నారు. ఎమ్మెల్యేకి చిత్తశుద్ధి ఉంటే మేము చెప్పే ఆధారాలు సేకరించాలన్నారు. దీనిమీద విచారణ జరిపించాలన్నారు. కలెక్టర్, ఆర్డీవో, ఎస్పీలు విచారణ చేసి నిజనిర్ధారణ చేయాలన్నారు. ప్రతిసారి ఎమ్మెల్యే మీడియా సమావేశం పెట్టి ఆధారాలు లేవనడం మంచి పద్ధతి కాదన్నారు. ఆధా రాలు ఉండబట్టే సాయి బాలజీ వెంచర్‌లో అన్ని బయట పెట్టారన్నారు. అదేవిధంగా జగనన్న కాలనీలో చాలా అవినీతి జరిగిందని, కేసానుపల్లి, కాకాని, ములకలూరులో అవినీతి జరిగిందని ఆ విధంగా ఎమ్మెల్యే అవినీతి రోజుకొకటి బయట పెడతామన్నారు. మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావు మాట్లాడుతూ తురిమెళ్లలో శ్రీనివాసరావుపై దాడి జరిగితే వాళ్ల అన్నదమ్ములే కొట్టారని, వైసీపీకి సంబంధం లేదని ఎమ్మెల్యే అంటున్నారు, అలాంటప్పుడు ఐదుగురు మీద కేసు పెడితే వాళ్ళ పేర్లు తీసి వేశారని, వాళ్ళపేర్లు ఎందుకు తీసివేయించారని ప్రశ్నించారు. అలవాలలో కొంత మంది బంధువులను టీడీపీలో చేర్పించి వెన్నా బాలకోటిరెడ్డిని చంపించారని, ఇప్పుడు మీ పార్టీవాళ్ళే చంపారని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మైండ్ గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. అలాటి మైండ్‌గేమ్‌లు ఆడటం చదలవాడకు తెలియదన్నారు. సమావేశంలో కొక్కిరాల గంగాధర్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ, షేక్ మాబు, గూడూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కులే ప్రామాణికం కాదు

● గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

● ఘనంగా లయోలా గోల్డెన్ జూబ్లీ వేడుకలు



సభావేదికపై మాట్లాడుతున్న గుంటూరు బిషప్ భాగ్యయ్య

వినుకొండటౌన్, ఫిబ్రవరి 10: ప్రతి విద్యార్థికి జ్ఞాన ఫలాలు అందించాలనే లక్ష్యంతో వెనుకబడిన వినుకొండ ప్రాంతంలో 1971లో అడిగొప్పల బాలయ్య నేతృత్వంలో పాఠశాలను స్థాపించినట్లు గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. నాగిరెడ్డిపల్లి సమీపంలోని లయోలా ఉన్నత పాఠశాలలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిషప్ మాట్లాడుతూ ముందుగా సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేశాన్ని ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలల అధికారి స్టెయిన్స్‌లస్ మాట్లాడుతూ పాఠశాలల్లో మార్కులు ప్రామాణికం కాదని, ప్రతివిద్యార్థికి సాంస్కృతిక సంప్రదాయాలతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని, అది లయోలా నేర్పిస్తుందని, టీమ్ వర్క్‌తో విద్యార్థులు అనుకున్న ఆశయసాధన సాధ్యమవుతుందన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారని, త్వరలో వరికపూడిశెల నిర్మించి తీరుతామని అన్నారు. వినుకొండ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పాఠశాలలో చదివిన మధుర జ్ఞాపకాలు మరువరానివని అన్నారు. ఉపాధ్యాయుల బోధన, వారు నేర్పిన క్రమశిక్షణ కారణంగానే జన్మభూమి రుణం తీర్చుకునేందుకు ఎమ్మెల్యేగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నానని, లయోలా పాఠశాల రాష్ట్రంలోనే ఎంతో గుర్తింపు కలిగి ఉందని, 12 సంవత్సరాలు స్కూల్ చాంపియన్ తెచ్చిన ఘనత పీఈటీ నాగేశ్వరరావు మాస్టారుకు దక్కిందన్నారు. పాఠశాలకు ఎంతో రుణపడి ఉన్నామని, పాఠశాలలో చదివిన ప్రతి ఒక్కరూ దేశభక్తి అలవర్చుకొని గేమ్స్‌లోనూ, కల్చర్‌లో విద్యలో రాణించాలన్నారు. పాఠశాలలో 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం ప్రతి సంవత్సరం రూ.5లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ వెనుకబడిన వినుకొండలోని లయోలా పాఠశాలలో పేద విద్యార్థులు అందుబాటులో ఉండేందుకు జూనియర్ కళాశాలను స్థాపించాలని యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జ్ఞానదేవన్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడులు పెట్టేందుకు ఏజెంట్లు కృషి చేయాలి

● ఎల్ఐసీ ఏవోఐ రాష్ట్ర అధ్యక్షుడు టి.కోటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్ఐసీఏవోఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు

వినుకొండ, ఫిబ్రవరి 10 : భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎల్ఐసీ లోనే పెట్టుబడులు పెట్టేందుకు ఏజెంట్లు కృషి చేయాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ ఏవో ఐ) రాష్ట్ర అధ్యక్షుడు టి.కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయంలో సీనియర్ ఏజెంట్ ఎస్ కోటేశ్వరరావు అధ్యక్షతన ఎల్ఐసీ ఏవోఐ ఏజెంట్ల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు టి.కోటేశ్వరరావు మా ట్లాడుతూ రానున్న రోజుల్లో సంస్థల్లో అనేక రకాల మార్పులు జరుగుతున్నాయని, వాటి వల్ల సంస్థ ప్రయోజనాలు దెబ్బతినడంతో పాటు ఏజెంట్లకు అనేకరకాల ఇబ్బందులు రానున్నాయన్నారు. వాటన్నింటిని ఎదుర్కొని సంస్థను కాపాడుకునేందుకు ఏజెంట్లు ఐక్యంగా ఉండాలని తెలిపారు. ఇప్పటికే అనేక రకాల పన్నులతో ప్రభుత్వాలు పాలసీదారులను ఇబ్బంది పెడుతున్నాయని చెప్పారు. ఏజెంట్లకు ఇచ్చే గ్రాట్యూటీ లెక్కింపు విధానంలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. పాలసీదారుల ప్రయోజనాల దృష్ట్యా జీఎస్టీని ఎత్తివేసి బోనస్‌ను పెంచాలని కోరారు. అనంతరం నూతనకమిటీని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా సన్నెగంటి కోటేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులుగా బొంకూరి వెంకటేశ్వర్లు, అంబటి ఐరామ్మూర్తి, కోశాధికారిగా ఆర్‌జే నరసింహారావుతో పాటు మరో 9మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం డివిజన్ వై.గాంధీరామ్మోహన్‌రావు, ఏబీఎం వెంకటేష్, బ్రాంచి ఏవోఐ కార్యదర్శి గల్లా సీతారామయ్య, పి.శ్రీనివాసరావు, జి.నవీన్‌కుమార్, పి.బ్రహ్మయ్య, ఏఐ రామ్మూర్తి, రాములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయాల వార్షికోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అద్దంకమ్మ తల్లి

రొంపిచర్ల, ఫిబ్రవరి 10: మండలంలోని రొంపిచర్ల పడమటిపాలెంలో ఉన్న అద్దంకమ్మ, పోలేరమ్మ తల్లి ఆలయాల ప్రథమ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్లు నిర్వహించి ప్రదర్శనగా ఆలయాల వద్దకు వెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవార్లకు మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అద్దంకమ్మ తల్లి, పోలేరమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 10: నరసరావుపేట ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, మాచర్ల డిపోల నుంచి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని 70మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీ శ్రీనివాసరావు, ఆర్టీసీ డిస్పెన్సరీ డాక్టర్ ఎన్ నరసింహారెడ్డి, డీఎం బీ వీరాస్వామి, ఆర్ ఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెట్టు మీద నుంచి పడి వ్యక్తి మృతి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 10 : చెట్టు మీద నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో శనివారం జరిగింది. అచ్చంపేట రోడ్డులో నివశిస్తున్న పసుపులేటి నాగరాజు (42) తన ఇంటి ఎదురుగా ఉన్న చింత చెట్టుపైకి చింతకాయలు కోసేందుకు తన స్నేహితులతో కలసి ఎక్కాడు. చింతకాయలు కోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రత్తిపాటి వెంకటకుమారి, టీడీపీ నాయకులు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 10: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త మొద్దు శ్రీను అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి వారిని పరామర్శించి ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కాగా 33వ వార్డుకు చెందిన పాశం కొండయ్య మరణించటంతో వారి కుటుంబానికి కూడా ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయం స్థానిక టీడీపీ నాయకుల ద్వారా అందించారు.

నా పేట నా ప్రజలు కరపత్రాల ఆవిష్కరణ

నా పేట నా ప్రజలు పేరుతో తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘమైన ఐటీడీపీ చిలకలూరిపేట వారు రూపొందించిన కరపత్రాన్ని ప్రత్తిపాటి వెంకటకుమారి ఆవిష్కరించారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధే తారక మంత్రంగా నా పేట నా ప్రజలు అనే నినాదంతో ప్రత్తిపాటి పుల్లారావు ప్రజల ముందుకు రాబోతున్నట్టు ఆమె వివరించారు.

ప్రత్యేక పూజలు

పట్టణంలోని 14వ వార్డు పెదనందిపాడు రోడ్డు ఎరుకల కాలనీలో ఉన్న శ్రీ జ్వాలాముఖి పోలేరమ్మ తల్లి దేవస్థానం 4వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్తిపాటి వెంకటకుమారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరూ అమ్మవారి కృపా కటాక్షాలతో ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రత్తిపాటి ఫౌండేషన్ కంటి వైద్యశిబిరం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 10 : పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి హాస్పటల్ సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించబడునని, కంటి సమస్యలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ వైద్య శిబిరంలో ఎన్నికైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, కెల్లంపల్లి అచ్చయ్య కాట్రు రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కోసమే శంఖారావం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు టీడీపీ శంఖారావం చేపట్టిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో అన్నారు. జగన్‌రెడ్డి, వైసీపీ అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావం అన్నారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలు, దుర్మార్గాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేస్తామన్నారు. నిరుద్యోగయువత పడుతున్న ఇబ్బందులు, నిత్యవసరాల ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను వివరించడం జరుగుతుందన్నారు. రానున్న 40-50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాలలోనారా లోకేశ్ పర్యటన సాగుతుందన్నారు. బాబు హామీ భవిష్యత్‌కు హామీ కార్యక్రమంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళతామన్నారు. అరాచక జగన్‌రెడ్డి పాలనలో బాధితులుగా మారిన అన్ని వర్గాల ప్రజలకు పాదయాత్ర ద్వారా లోకేశ్ భరోసా ఇవ్వటం జరిగిందన్నారు. ఒక్కరోజు మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలో శంఖారావం కార్యక్రమం జరుగుతుందని, కార్యకర్తలు నేరుగా నారా లోకేశ్‌తో కలిసి తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

లోకేశ్ శంఖారావంతో వైసీపీకి చరమ గీతం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 10 : రాష్ట్రం నుంచి వైసీపీని పూర్తిగా తుడిచి పెడితే తప్పా ప్రజల కష్టాలు తీరవని, అంతగా వారి ఉసురు పోసుకుంటున్న జగన్ పాలనకు ఆ పార్టీకి కూడా చరమ గీతంగా లోకేశ్ శంఖారావం యాత్ర నిలవబోతుందని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తండ్రి పేరు చెప్పుకొని విశ్వసనీయతకు మారు పేరు అంటూ ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చి వారిని ఎన్ని విధాలుగా మోసం చేశారో ఈ ప్రభుత్వం ఎన్ని విధాలుగా దురాగతాలకు పాల్పడిందో అందరికీ తెలియజేయటమే శంఖారావం ఉద్దేశమని ప్రత్తిపాటి పేర్కొన్నారు. రానున్న 40 నుంచి 50 రోజుల పాటు 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ యాత్ర సాగనున్నదని ఆయన తెలిపారు. ఆదివారం ఉత్తరాంధ్ర నుంచి ప్రారంభం కాబోతున్న లోకేశ్ శంఖారావం సభను విజయవంతం చేయాలని శనివారం ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో కోరారు. ఈ యాత్రలో జగన్ ప్రభుత్వ బాధితుల ప్రతి ఒక్కరి వెతలను లోకేశ్ వింటారని, అధికారంలోకి రాగానే వాటికి పరిష్కారం చూపెడతారన్నారు.

జగన్‌కు అరాచకం తప్ప పాలన తెలియదు



గ్యారెంటీ కార్డులను పంపిణీ చేస్తున్న పుల్లారావు తదితరులు

నాదెండ్ల, ఫిబ్రవరి 10: ముఖ్యమంత్రి జగన్‌కు అరాచకం చేయటం తప్ప పాలన తెలియదని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మండలంలోని గొరిజవోలు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ సంక్షేమం పేరిట బటన్ నొక్కుతున్నానని చెప్పి రూపాయి ఇస్తూ పది రూపాయలను కొట్టేస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే అస్తవ్యస్తంగా మార్చిన రాష్ట్ర పరిస్థితులను చక్కదిద్దుతామని అన్నారు ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు తోట రాజా రమేష్, సదాశివరావు, గుర్రం స్వాములు, మస్తాన్‌రావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలన అంతమొందించడానికే 'శంఖారావం'

● యువనాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్



కడియాల లలిత్ సాగర్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 10: రాక్షస పాలన అంతమొందించడానికే లోకేశ్ శంఖారావం పూరిస్తున్నారని యువనాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రాన్ని ఐదు సంవత్సరాలుగా పట్టి పీడిస్తున్న రాక్షసుడు జగన్మోహన్‌రెడ్డి అని, ఆ రాక్షసుడి చెర నుంచి రాష్ట్రాన్ని విడిపించేందుకు ఈ నెల 11న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తలపెట్టిన శంఖారావం కార్యక్రమానికి టీడీపీ కార్యకర్తలంతా సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో ఉన్న అన్ని వనరులు దోచుకొని, అన్ని రంగాల వారికి అన్యాయం చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికి, అతని బృందానికి దక్కుతుందన్నారు. వైసీపీపై ఇప్పటికే ప్రజలు విసిగిపోయారని, రాష్ట్ర ప్రజలందరికి నేను ఉన్నాను అంటూ భరోసాగా నిలుస్తున్న మన నాయకుడు నారా లోకేశ్‌కు మనమందరం అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

జిల్లా కమిటీలో మాచర్ల, నరసరావుపేటవాసులకు స్థానం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 10: మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాలకు చెందిన వారిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు జిల్లా అనుబంధ కమిటీలలో వివిధ హోదాల్లో శనివారం నియమించారు. ఎస్సీ సెల్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శిగా మాచర్ల వాసు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శులుగా సాతులూరి కృష్ణ, జంగాల సునీల్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శిగా షేక్ మొహమ్మద్ యూసబ్, తెలుగుమహిళా జిల్లా కార్యదర్శిగా పచ్చిపాల అనురాధను నియమించారు.

తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

● 47 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 10: స్థానిక జొన్నలగడ్డలోగల తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 47 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వైవీ నారాయణ తెలిపారు. చెన్నైకి చెందిన ప్రఖ్యాతి గాంచిన సుధీర్ లాండ్ కంపెని ప్రతినిధులు శనివారం కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. వివిధ బ్రాంచిల నుంచి 320 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు 47 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, కళాశాల ఛైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, వైస్ ఛైర్మన్ బత్తిన నాగేశ్వరరావు, కోశాధికారి దండా బ్రహ్మానందం, ప్లేస్‌మెంట్ అధికారిని అభినందించారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 10: అక్రమ మద్యం కేసులో నిందితుడైన మండలంలోని కొండకావూరు గ్రామానికి చెందిన కే నాగరాజును అరెస్టు చేసినట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార శనివారం తెలిపారు. నిందితుడి నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఆమె తెలిపారు.